


కోట్లాట!


కత్తి.. కట్టి..




పిడింగొయ్యిలో బరి వద్ద గుమిగూడిన జనం.. కాళ్లు దువ్వుతున్న కోళ్లు


పోరాడి..ఓడి : నల్లజర్లలో బరిలోనే ప్రాణాలొదిలిన కోడి

కత్తి దిగింది.. రక్తం చిందింది!

రాజమహేంద్రవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కోడి పందేల విషయంలో ఈ ఏడాదీ అదే బొమ్మ పడింది. పండుగకు వారం ముందు జూలు విదిల్చిన నాలుగో సింహం చతికిల పడక తప్పలేదు. దీంతో మళ్లీ యంత్రాంగంపై పందెం పుంజు పైచేయి సాధించింది. ప్రతి ఏడాదీ జనాలకు అలవాటైపోయిన తంతే అయినా.. ఈసారి పోలీసుల దూకుడు చూసి పందెం బరుల పనైపోయిందనే చర్చ నడిచింది. పందెం బరులను ధ్వంసం చేయడం, కోడి పందేల జోలికెళ్తే జైలు తప్పదనే అత్యంత కఠినమైన హెచ్చరికలు చూసిన జనం నిజంగా నిజం కాబోలు అనుకున్నారు. శ్రమకోర్చి జిల్లాలో ఓ వెయ్యిలోపు కోడి కత్తులు స్వాధీనం చేసుకోవడంతో ఈసారి పందెం పుంజు తోకముడవక తప్పదనుకున్నారు. కానీ.. చివరికి కేసులు.. కాసులు.. కోసలు హల్‌చల్ చేశాయి. జాతి వైరం మాటున జరుగుతున్న హింసాక్రీడలో వందలాది మూగజీవాల రక్తంతో బరులు తడిచి ముద్దయ్యాయి. గుండాట, పేకాట తదితర జూదాలపై కూడా ఈ మూడు రోజులు చట్టం ముఖం చాటేసింది. సంక్రాంతి వచ్చిం దంటే గోదావరి జిల్లాల్లో కోడి పందేలు ఆపడం ఎవరికీ సాధ్యం కాదనే విషయం మరోసారి రుజువైంది. గతంలో చాటుమాటుగా పందేలు జరిగేవి ఇప్పుడు ప్రధాన రహదార్ల పక్కనే బరులు ఏర్పాటు చేస్తుంటే పోలీసులు కాపలా కాయాల్సిన దుస్థితి దాపురించింది. ఈసారి జిల్లాలో రూ.100 కోట్లపైనే కోడి పందేలపై డబ్బు చేతులు మారగా.. గుండాట, పేకాట, మూడు ముక్కలాట వంటి క్రీడల్లో జనం మరో రూ.10కోట్ల వరకూ పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది.

'బరి' తెగించి.. కత్తులు నూరేశారు!

- జిల్లాలో వెలిసిన 100 బరులు
- రెచ్చిపోయిన పందెంగాళ్లు
- వేలు..లక్షల్లోనే సాగిన పందేలు
- రూ. 100 కోట్లు ఆడేశారు..
- జోరుగా గుండాట, కోతాట
- యథేచ్ఛగా మందు.. విందు.. పసందు
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే బరులు
- కళ్లు మూసుకున్న అధికారులు
- మామూళ్ల మత్తులో పోలీసులు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

సై అంటే సై.. ఎంతైనా ఓకే.. పండుగ సందడిలో బరి తెగించారు.. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ బరులు వెలిశాయి. కోట్లాట హోరెత్తింది.. బరిలో కోళ్ల కత్తులు దూశాయ్.. నువ్వా నేనా అంటూ తలపడ్డాయ్.. యజమానులను గెలిపించాలని రక్తం చిందించాయ్..మూడు రోజుల కిందట సంక్రాంతి పందెం కోడి పోలీసులపై నెగ్గినట్టు కనిపించినా.. చివరికి బరిలో తుదిశ్వాస విడిచి ఓడిపోయింది. మూడు రోజుల కిందటి వరకూ ప్రగల్భాలు పలికిన పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇచ్చింది పుచ్చుకుని ప్రేక్షకపాత్రకే పరిమితమయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రూ. కోట్లలో కోడిపందాలు, గుంటాటలు , పేకాటలు, మూడు ముక్కలాటలు జరిగాయి. ఎన్నికల ఏడాది కావడంతో నాయకులు సైతం అడిగినవారికి కాదనకుండా బరులకు అనధికార అనుమతులిచ్చేశారు..మేమున్నాం మీరు వేసుకోండి అంటూ వెన్నుదన్నుగా నిలిచారు. గత మూడు రోజుల నుంచి వైసీపీ ప్రముఖులే కీలక పాత్ర పోషించారు. దీంతో పందేలు జోరుగా సాగాయి. ఎన్నడూ లేనిది జిల్లా కేంద్రం చుట్టు పక్కల భారీగా బరులు వెలిశాయి. పోలీసులు బరికి రూ.లక్షల్లో తీసుకొని ఇళ్లలో పడుకున్నట్టు విమర్శలు వచ్చాయి. సంక్రాంతికి ముందు పందెం ఆడనిచ్చేలేదని చెప్పి విస్తృత ప్రచారంచేసి, అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు. అయితే భోగి పండుగ మధ్యాహ్నం 12 గంటల మొదలు కనుమ వరకూ ఎక్కడా కనిపించలేదు. పబ్లిక్‌గా రోడ్ల ప్రక్క, ఊళ్ల మధ్యన బరులు వేసి రాత్రి పగలూ పందాలు నిర్వహించినా ఎవరూ ఆపే ప్రయత్నం కూడా చేయలేదు. జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో ఒక్కో మండలంలోనూ కనీసం రెండు నుంచి పది వరకూ బరులు వెలిశాయి. మొత్తంగా జిల్లాలో 80 నుంచి 100 బరులు వరకూ ఏర్పాటు చేసినట్టు అంచనా. గోకవరం మండలంలో భారీస్థాయిలో కోడిపందేలు నిర్వహించారు. ఒక్కో చోట కనీసం 20 పందేల నుంచి 50 వరకూ జరిగాయి. వీరలంకపల్లిలో భారీ బరి ఏర్పాటు చేశారు. వందలాది మంది పందెగాళ్లు కార్ల మీద ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చారు. ఒక్కో పందెం రూ. లక్ష వరకూ సాగింది. ఎల్ ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి, బయట జనానికి కూడా స్పష్టంగా కోళ్ల కొట్లాట కనిపించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సారి బరులు హైటెక్ స్థాయిలో ఏర్పాటు చేశారు. టెంట్ , ఫెన్సింగ్ ఏర్పాటు చేసి లోపలకు కొంతమందిని మాత్రమే అనుమతించారు. టికెట్లు కూడా పెట్టారు. అచ్చుతాపురంలో స్థానికులు పందాలు వేశారు. గోకవరం,కృష్ణునిపాలెం, కొత్తపల్లి, మల్లవరం,తిరుమలాయపాలెం, రంప ఎర్రంపాలెం, వెదురుపాక, తంటికొండ ప్రాంతాల్లో జోరుగా పందాలు, గుండాటలు సాగాయి. ఒక్కో పుంజు తరపున రూ.లక్ష వరకూ పందెం జరగగా..బయట పందేలు వేలల్లో జరిగాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో పిడింగొయ్యలో పెద్దపందెం వేశారు. పందెం ఒకటి రూ.లక్ష. రాత్రి పగలూ కూడా ఆడేస్తు న్నారు. కవలగొయ్యలో కూడా గట్టిగా ఆడారు. కడియం మండలంలో వీరవరం, బుర్రిలంక గ్రామాల్లో కోడి పందేలు సాగాయి. అనపర్తి, రంగంపేట, బిక్కవోలులో అనేక చోట్ల పెద్ద పందాలు జరిగాయి. సీతానగరం మండలంలో వైసీపీ రెండు వర్గాలు చీలి రెండు బరులు పెద్దవి నిర్వహించింది. రూ.లక్షలు చేతులు మారాయి.కోరుకొండ, రాజానగరం మండలాల్లో అధికంగా జరిగాయి. రాజానగరం మండలం పుణ్యక్షేత్రంలో పెద్ద బరి ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ వేలాదిగా జనం వచ్చి పందేలను తిలకించారు. గోపాలపురం మండలంలో గోపాలపురం,వేళ్లచింతలపూడి, వెంకటాయపాలెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, దొండపూడి, హుకుంపేట, గ్రామాల్లో రూ.కోట్లలో పందేలు జరిగాయి. కొవ్వూరు, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, చాగల్లు, తాళ్లపూడి, నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో అత్యధికంగా పందాలు జరిగాయి. జిల్లాలో సుమారు 80 నుంచి 100 వరకు బరులు ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు బందోబస్తు చర్యలు చేపట్టారు.సుమారు రూ.100 కోట్ల వరకూ పందెం, గుంటాలు జరిగినట్టు చెబుతున్నారు. సందట్లో సడేమియాగా మద్యం వ్యాపారం జోరుగా సాగింది. పందెం దగ్గర అందరూ ఊగేవాళ్లు, తూగేవాళ్లే. చుక్కేసి ముక్కేసి ఆడేశారు. అయినా పోలీసులు మాత్రం పట్టించుకోలేదు. కోడి పందేల ముసుగులో జూదం భారీగా సాగింది. ఎక్కడికక్కడ బెల్ట్ షాపులు వెలిసినా ఎస్ఈబీ అధికారులు నోరుమెదపకపోవడం గమనార్హం.గుంటాటలు కనీసం రూ.100 కాస్తేనే కానీ అనుమతించలేదు. ఎక్కువ మంది రూ.500 నుంచి వేలల్లో కాశారు. గుంటాట నిర్వాహకులు, పందెం నిర్వాహకులు భారీగా సంపాదించారు. ఎన్ని కల ముందు సంక్రాంతి కావడంతో రాజకీయనేతలంతా లోపాయికారిగా సహకరించి పందేలు వేయించారు. పోలీసు లకు కూడా భారీగా ముడుపులు అందినట్టు నిర్వాహకులే చెబుతున్నారు.ఈ మూడు రోజుల్లో ఎక్కడా ఒక కేసు నమోదు చేసినట్టు లేదు. వందల్లో బరులు ఏర్పాటు చేసి.. రూ.కోట్లల్లో జూదక్రీడ రెచ్చిపోగా.. కొన్ని కేసు లు పెట్టి ఈ ఏడాది చేతులు దులుపుకునే పనిలో పడ్డారు. ప్రజాప్రతి నిధుల అధికార దండం ముందు జిల్లా పోలీస్ బాస్ చేతులు కట్టుకోక తప్పలేదు. కోడి పందేల విషయంలో కోర్టు ఆదేశాలనే పాటిస్తామని స్పష్టంగా చెప్పిన మాటలనూ పక్కన పెట్టేయక తప్పలేదు.


కొవ్వూరులో బరి వద్ద వాహనాలు


కొవ్వూరులో సాగుతున్న గుండాట

కేసులు.. కాసులు.. కోసలు

జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషను పరిధిలోనూ కోడి పందేలు జరిగాయి. పెద్ద బరుల్లో కోట్లాది రూపాయల్లో జూదం ఆడారు. కోడి పందేలు ఆపడం సాధ్యం కాదనే విషయం యంత్రాంగానికి అనుభవంలో ఉండడంతో ఉభయ కుశలోపరి కింద ప్రజాప్రతినిధుల సలహాలతో ఓ లోపాయికారీ ఒప్పందం నడిచింది. పోలీస్ స్టేషనుకు బరిని బట్టి కాసులు.. కేసులు.. కోశలు లెక్కన వెసులుబాటును తెరపైకి తెచ్చారు. కనీసం మూడు కేసులు బనాయించే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అలాగే 'మామూళ్లు' మామూలే. చిన్న బరికి రూ.50 వేలు పెద్ద బరి స్థాయిని బట్టి రూ.లక్ష పైనే వసూలు చేశారు. ఇక స్టేషనుకు ఇన్ని కోసలు(ఓడిపోయి చనిపోయిన పందెం పుంజు) ఇవ్వాలనే హుకుం కూడా ఇచ్చారు.అంతే కాదండోయ్ మూడు కోళ్లు పట్టుకున్నట్టు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం.




గోపాలపురంలో కోళ్లను పందేనికి తీసుకెళుతున్న బాలుడు

కోసకు డిమాండ్



నల్లజర్ల/ గోపాలపురం/ కొవ్వూరు : పందెంలో ఓడిన కోడి(కోస)కు డిమాండ్ పెరిగింది.కనుము కావడంతో కోసాకు జనం పరుగులు తీశారు.రెండు కేజీలు ఉన్న కోస మాంసం రెండు వేల ఉంచి 3 వేల వరకు పలికింది.కోస మాంసానికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో నల్లజర్ల మండలం అనంతపల్లి, చోడవరం,ప్రకాశరావుపాలెం,దూబచర్లలో ఇంట్లో పెంచుకుని కోడి పుంజులను తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లేడ్‌తో కోసి వాటిని కాల్చి కోస మాంసంగా విక్రయించారు. వెయ్యి రూపాయలకు కొనుగోలు చేస్తే రెండు వేల వరకు వసూలు చేశారు. గోపాలపురం ఒక్కొక్క కోస రూ.2500 నుంచి దాని బరువును బట్టి రూ.5వేల వరకు ధర పలికింది. కొవ్వూరులో అయితే రూ.3 వేల వరకూ విక్రయించారు.

డ్వామా పీడీగా జగదాంబ తొలగింపు

రాజమహేంద్రవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : డ్వా మా పీడీ పి.జగదాంబను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్య కుమారి ఈనెల 12న తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. కత్తిపూడి డీఎల్‌డీవోగా తిరిగి చేరవలసిందిగా ఆదేశించారు.వాస్తవానికి ఉపాధి హామీ సిబ్బంది ఆమెపై ఫిర్యాదు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్టు తెలిసింది.కొత్త జిల్లా ఏర్పడినప్పుడు మొదట కొవ్వూరు ఎంపీడీవోగా ఉండేవారు.తర్వాత డ్వామా పీడీగా బాధ్యతలు స్వీక రించి, కొద్దినెలల తర్వాత డీపీవోగా నియమితులయ్యారు. ఓ ఎమ్మెల్యే ఒత్తిడి వల్ల ఆమెను డీపీవోగా తప్పించినట్టు సమాచారం. కొద్దిరోజులు ఖాళీగా ఉన్న జగదాంబ తిరిగి డ్వామా పీడీగా ఐదు నెలల కిందట బాధ్యతలు చేపట్టారు.ఇదిలా ఉండగా పండుగ సమయంలో ఆమెను తొల గించి కత్తిపూడి డీఎల్‌డీవోగా చేరాలని ఆదేశించడం గమనార్హం.

జాతీయ కాన్ఫరెన్స్‌కు మంగారాణి



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 16 : రాజమహేంద్రవరం శ్రీ నాగరాజా స్పెషల్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణికి కేంద్రప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. కేంద్ర ప్రభుత్వం జనవరి 29 నుంచి 31వ తేదీ వరకూ న్యూఢిల్లీలోని విశ్వ యువ కేంద్రంలో నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్ జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు ఆంధ్రరాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపిక కాగా అందులో మంగారాణి ఒకరు.


సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నల్లజర్ల మండలం పోతవరంలో మెతుకూరి శ్రీను కుటుంబీకులు సోమవారం ఒకే అరటి ఆకులో 36 వంటకాలతో ఇలా భోజనం చేశారు.

పండుగ విషాదం

సంక్రాంతి పండుగ ఆనందం ఆవిరైంది.. పలు కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చింది.. మద్యం మత్తు పలువురి ప్రాణాలు తీసింది.. వెనుక నుంచి బైక్ ఢీకొట్టి ఒకరు.. ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టి మరొకరు మృతిచెందారు.. మరో యువకుడు పండుగకని మేనమామ ఇంటికి వెళుతూ బైక్ అదుపు తప్పిరోడ్డుపై పడి మృతిచెందాడు. మద్యం మత్తులో ఉన్న మరో వృద్ధుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో సజీవదహనమయ్యాడు. ఇలా వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు.. అప్పటి వరకూ తమతో ఉన్న వారు ఇక లేరని తెలిసి కుటుంబీకులు బోరుమన్నారు.

- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి
- పండుగకు వచ్చి ప్రమాదానికి గురి
- కన్నీరు మున్నీరైన కుటుంబీకులు
- 4 కుటుంబాల్లో తీవ్ర విషాదం

బైక్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

కొవ్వూరు, జనవరి 16 : పండుగకు ఆనందంగా ఇంటికి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమా దంలో మృతిచెందాడు. కొవ్వూరు పట్టణానికి చెందిన యాదం దుర్గా నాగసాయి కుమార్ (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీన ఇంటికి వచ్చాడు. 15వ తేదీన తండ్రి మోటారు సైకిల్ తీసుకుని రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని బయలుదేరాడు. ఏజీఆర్‌బీ రోడ్‌పై ఆంధ్రా ఫామ్ కెమికల్ ఫ్యాక్టరీ ఎదురుగా వెనుకనుంచి వస్తున్న బైక్ యువకుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్ కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మృతి చెం దాడు. మృతుడి తండ్రి సంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. పండుగకు వచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇక మాకు దిక్కెవరంటూ బోరుమన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..



దేవరపల్లి, జనవరి 16 : సంక్రాంతి పండుగను మావయ్య ఇంటి వద్ద జరుపు కుందామని బయలుదేరిన యువకుడు బైక్ ప్రమాదంలో మృతిచెందాడు. కోరుకొండ గ్రామానికి చెందిన పంపన విష్ణు తేజ(24) పాలిటెక్నిక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. సోమవారం ఉదయం కోరుకొండ నుంచి బైక్‌పై నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామంలో ఉన్న తన మేనమామ వద్దకు సంక్రాంతి పండుగకు బయలుదేరాడు. దేవరపల్లి మండలం యర్నగూడెం జాతీయరహదారి ఫ్లయ్ ఓవర్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. అతన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని సీఐ రామకృష్ణ పరిశీలించారు. మృతుడి మేనమామ తంగెళ్ల రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అత్తవారింటికి వస్తుండగా మరొకరు..



దేవరపల్లి, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా అత్తవారింటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. గోపాలపురం మం డలం దొండపూడి గ్రామానికి చెందిన జాలిం వంశీకృష్ణ(25) బంధువుల శుభకార్యా నికి వెళ్లి తిరిగి సంక్రాంతి పండుగ నిమిత్తం దేవరపల్లి మండలం యర్నగూడెంలోని అత్తవారింటికి బయలుదేరాడు. కాసేపట్లో అత్తవారింటికి చేరుకుంటాడనే లోపునే ప్రమాదం జరిగింది. ఎదురుగా నిర్లక్ష్యంగా, అతివేగంగా వస్తున్న బైకు ఢీకొనడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో అతడిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పట్టుకుని భార్య విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. వృద్ధుడి సజీవ దహనం

దేవరపల్లి, జనవరి 16 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వృద్ధుడు సజీవ దహనమయ్యాడు.పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామానికి చెందిన సుంకర భీమరాజు (73) తన భార్యతో 9 నెలల క్రితం దేవరపల్లి గ్రామంలో రైతు వద్ద కూలిపనికి వచ్చాడు. రైతు పొగాకు బేరన్ పక్కన ఉన్న రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మృతుడు గత మూడు రోజులుగా మద్యం సేవించి భార్యను కొడుతున్నాడు. మద్యం మా నేయాలని భార్య చెప్పినా వినలేదు.ఇదిలా ఉండగా సోమవారం రాత్రి 9 గంటలకు మళ్లీ మృతుడు విపరీతంగా సేవించి రావడంతో ఎక్కడ కొడతాడోనని భార్య భయపడి పక్కింట్లో పడుకుందన్నారు. భీమరాజు మాత్రం తన షెడ్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి సమ యంలో షెడ్ నుంచి ఒక్కసారిగా మంటలు చెల రేగాయి. రాత్రి 11 గంటల సమయంలో స్థానికులు గమనించి మంటలు ఎగడిపడుతున్నాయని కేకలు వేశారు. దీంతో భార్య బయటకు వచ్చి చూసే సరికి మంటలు ఎగసిపడుతున్నాయి. భీమరాజు మంటల్లో చిక్కుకున్నాడని భార్య భోరున విలపించింది. షెడ్డులో బేరన్‌కు సంబంధించిన పురుకూసలు ఉండడం వల్ల మంటలు మరింతగా ఎగసి పడి భీమరాజు సజీవదహన మయ్యాడని పోలీసులు తెలిపారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షెడ్డుకు మంటలు అంటుకు న్నట్టు సమాచారం.సంఘటనా స్థలాన్ని సీఐ రామ కృష్ణ, ఎస్ఐ శ్రీహరిరావు పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలి పారు.


సజీవదహనమైన మృతదేహం పరిశీలన

రూ.కోట్లలో సాగుతున్న పేకాట

మిర్తిపాడు- మధురపూడి మధ్య భారీ పేకాట శిబిరం

రాజమహేంద్రవరం, జనవరి16(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతిని పురస్కరించుకుని సందట్లో సడేమియా అన్నట్టు మధురపూడి, మిర్తిపాడు గ్రామాల మధ్య కోరుకొండ పోలీసు స్టేషన్ పరిధిలో భారీ పేకాట శిబిరం నిర్వహించారు. రాత్రి పగలూ ఒకటే ఆట. రూ.కోట్లలో పేకాట ఆడినట్టు సమాచారం.పలువురు ప్రముఖులు ఆయా ఊర్ల పెద్దలు, మోతుబరులు ఈ మూడు రోజులు పేకాటలోనే నిమగ్నం కావడం గమనార్హం. మరో పక్క మూడు ముక్కలాట, గుండాట వంటి జూదంగా భారీగా ఆడడం గమనార్హం. పోలీసులు కనీసం కన్నెత్తి చూడలేదు. ఇది రాజకీయనేతలు, పోలీసులకు తెలిసే జరిగినట్టు సమాచారం.రాత్రి వేళ భారీ లైటింగ్ ఏర్పాటు చేసుకుని జూదంలో నిమగ్నమయ్యారు. కొందరు భారీగా డబ్బు పోగొట్టుకోగా, కొందరు జేబులు నింపుకున్నారు. నిర్వాహకులు భారీ వెనకేసుకున్నట్టు చెబుతున్నారు.

జగ్గంపేట వైసీపీలో ఆధిపత్య పోరు

గోకవరం ఎస్ఐ ఆకస్మిక బదిలీ.. కొత్త ఎస్ఐగా నాగరాజు

రాజమహేంద్రవరం, జనవరి16(ఆంధ్రజ్యోతి) : గోకవరం వైసీపీలో ఆధిపత్యపోరు అక్కడ ఎస్ఐ బదిలీ అవ్వడానికి దారి తీసింది. ఇటీవల కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబును పక్కన పెట్టి ఆ నియోజకవర్గానికి మాజీ మంత్రి తోట నరసింహంను ఇన్‌చార్జిగా నియమించిన సంగతి తెలి సిందే.దీంతో ఆయన వర్గానికి చెందిన ఓ దళిత నేతను గతంలో ఎస్ఐ కాస్త ఇబ్బంది పెట్టారనే కారణంతో పండగ ముందు ఆకస్మికంగా బదిలీ చేయించినట్టు తెలిసింది. ఇక్కడ ఎస్ఐ యూవీ.శివనాగబాబు గతంలో ఎమ్మెల్యే చంటిబాబుకు అనుకూలంగా వ్యవహరించినట్టు సమాచారం. ఇవాళ వ్యతిరేకవర్గానికి పెత్తనం రావడంతో ఈ పరిణామం సంభవించింది. దీంతో నియోజకవర్గంలో వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇంతవరకూ తమ చేతిలో ఆధిపత్యం ఉందని విర్రవీగిన వాళ్లకు, ఇవాళ మరొకరి చేతిలోకి వెళ్లడంతో ఇబ్బందిగా ఉన్నారు. వైసీపీనీ వీడిపోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కొత్తగా కె.నాగరాజు ఎస్ఐగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

భక్తజన జాతర



తరతరాల సంప్రదాయం తళుకులీనింది. కోనసీమలో ప్రభలు ఊరేగాయి. పద్దె పండగ కోనసీమకు కొత్త అందాలు అద్దింది. నేలతల్లి అభయహస్తాల్లాంటి కొబ్బరి చెట్లతో పోటీ పడుతూ రంగురంగుల ప్రభలు ముందుకు సాగాయి. అన్నపూర్ణ పరిచిన మహావిస్తరిలాంటి వరి చేలలో వాటి పయనం కనువిందు చేసింది....డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లిశివారు జగ్గన్నతోట ప్రభల తీర్థం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. జగ్గన్నతోట 7 ఎకరాల భూమి భక్తులతో కిక్కిరిసింది.



ఎడ్లబండిపై తీర్థం చూడడానికి..



కొలువుదీరిన ప్రభలు

జన సందోహం | జగ్గన్నతోట ప్రభల తీర్థం

తీర్థంలో కొలువుదీరిన ఏకాదశ రుద్రుల ప్రభలు

ప్రభలు అప్పర్‌కౌశిక దాటే సమయంలో

వీక్షించేందుకు పోటెత్తిన భక్తులు

తీర్థంలో భారీ బందోబస్తు

వివిధ రాష్ట్రాలు,

విదేశాల నుంచి కూడా వచ్చిన జనం

కిక్కిరిసిన రహదారులు

అంబాజీపేట, జనవరి 16:తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి నుంచి జగ్గన్నతోటకు వెళ్లే రోడ్లన్నీ కిటకిటలాడాయి. 450 ఏళ్ల నుంచి ఏకాదశ రుద్రులు కొలువుగా ప్రసిద్ధిగాంచిన జగ్గన్నతోటకు వివిధ గ్రామాల నుంచి 11 ప్రభలు తరలిరావడం సంప్రదాయం. తీర్థానికి వచ్చే ఇతర గ్రామాల ప్రభలకు స్వాగతం పలికే మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి ప్రభల ఉదయం తొమ్మిది గంటలకే తీర్థంలో కొలువుతీరి స్వాగతం పలికింది. కౌశిక అవతలవైపు ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభ, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు కౌశిక దాటి తీర్థంలో ప్రవేశించే ఘట్టం చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. శరభ... శరభ.. అశ్శరభ శరభ అంటూ బరువైన ప్రభలను యువకులు అవలీలగా భుజానకెత్తుకొని భక్తిభావంతో ముందుకు సాగారు. ఉదయం ఎనిమిది గంటలకే ఆయా గ్రామాల్లోని ప్రభలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ప్రభలపై కొలువుతీర్చి మేళతాళాలతో తీర్థానికి తీసుకువచ్చారు. చిరతపూడి చిట్టిచెరువు గట్టు, నరేంద్రపురం, అవిడి, రాకూర్తివారిపాలెం ప్రభలు చిరతపూడిలో కొలువుతీరాయి. వాకలగరవు, తొండవరం ప్రభలు తొండవరంలో కొలువుదీరాయి. తొండవరం, వాకలగరువు ప్రభలు ఒకదానికొకటి పోటీపడి చూపరులను కనువిందు చేశాయి.





కొలువుదీరిన ప్రభలు

ట్రాఫిక్ కష్టాలు

ఇరుసుమండ, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి రహదారులు వాహనాలతో నిండిపోవడంతో ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

భారీ బందోబస్తు

మొసల్లపల్లి శివారు జగ్గన్నతోటతో పాటు వాకలగరువు, చిరతపూడి ప్రభల ఉత్సవాలకు జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ ఏ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఎస్ పార్టీ బలగాలను మోహరించారు.



ఆకర్షణీయంగా ఉన్న ప్రభలు

కొలువుదీరిన ప్రభలు

వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వర స్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి (సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (త్రికాగ్ని కాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి (శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి(కాలాగ్ని రుద్రుడు) , వక్కలంక విశ్వేరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వర స్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి (సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు) జగ్గన్నతోట ప్రభల తీర్థంలో కొలువుదీరారు.

సంబరాన్ని వీక్షించేందుకు వచ్చిన జనం



అంబరాన్నంటిన సంబరం

కొత్తపేట, జనవరి 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాల వారు సైతం పండుగకు విచ్చేసి సందడి చేశారు. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వచ్చిన ప్రభలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొలువుదీర్చారు. నాదస్వర మేళాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, డీజే పాటలు ఎంతగానో అలరించాయి. బోడిపాలెం, కొత్త, పాత రామాలయ వీధుల ఉత్సవదారుల ఆధ్వర్యంలో పోటాపోటీగా జరిగిన బాణసంచా కాల్పులు చూపరులను కట్టిపడేశాయి. ప్రభలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లక్షలాదిగా తరలివచ్చిన వారితో కొత్తపేటలోని ముఖ్య కూడళ్లన్నీ జనసంద్రంగా మారాయి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పులు





ఆకట్టుకున్న స్వర్ణప్రభ

కొత్తపేట, జనవరి 16: కొత్తపేట శ్రీవిద్య జ్యువెలర్స్ మణి అనే స్వర్ణకారుడితో మూడు గ్రాముల బంగారంతో తయారు చేయించిన లక్ష్మీగణపతి ప్రభ అందరినీ ఆకట్టుకుంది. సంక్రాంతి ఉత్సవానికి వచ్చిన వారు దీనిని చూసేందుకు ఎగబడ్డారు.

మకరజ్యోతి దర్శనం



ఆభరణాలను తీసుకువస్తున్న దృశ్యం

మండపేట, జనవరి 16: ఆంధ్రా శబరిమలైగా పిలిచే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శన ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎ.ఎల్ కనకరాజు సారథ్యంలో సోమవారం గురుస్వామి స్వగృహం నుంచి స్వామివారి ఆభరణాలను రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన కర్రి ఆదినారాయణరెడ్డి శిరస్సున ధరించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, ఇరుముడుల సమర్పణ జరిగింది. సాయంత్రం బాణసంచా కాల్పులు, మేళతాళాల నడుమ మకరజ్యోతి దర్శనం జరిగింది. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు స్వాములకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రత్నగిరిపై ప్రభల ఉత్సవం

అన్నవరం, జనవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం ప్రభల ఉత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం 7గంటలకు స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి పల్లకిలో బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ కొండదిగువ చినరావిచెట్టు పుర గిరి క్షత్రియుల రామాలయం వద్దకు తీసుకునివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రభపై స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఈవోలు కృష్ణారావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు. సత్యదేవుడి గోశాలలో మంగళవారం సాయంత్రం గోపూజోత్సవం నిర్వహించారు. ఈవో రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కనుమ పండుగ రోజున గోపూజ నిర్వహించడం ద్వారా పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని పండితులు పేర్కొన్నారు.



ఎడ్లబండ్ల వేషాలు

చేబ్రోలులో దేవతామూర్తుల

వేషధారణల ప్రదర్శన

ఆకట్టుకున్న కళాకారులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎడ్లబండ్లపై వేషధారణలతో గ్రామమంతా ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణ వేషధారణలు, వివిధ దేవ తాలంకారాలతో జరిపిన ప్రదర్శన ఆకట్టుకొంది. నరకాసుర సంహారం తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రతీ ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ బండ్ల వేషాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కళాకారులు వేషాలు వేయడంతో తిలకించేందుకు వీధుల్లోకి భారీగా తరలివచ్చారు. రాత్రంతా బండ్ల వేషాలు కొనసాగాయి. వీటిని తిలకించేందుకు ఇతర గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడం విశేషం. బండ్ల వేషాలతో గ్రామమంతా సందడి నెలకొంది.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

పురుషుల విభాగంలో హైదరాబాద్,

మహిళల విభాగంలో ఛత్తీస్‌గఢ్ జట్లు విజేతలు



విజేతలతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

రామచంద్రపురం, జనవరి 16: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 12 నుంచి 15 వరకు జరిగిన 13వ ఆలిండియా, 19వ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో సెయింట్ ఆర్టిలేరి (హైదరాబాద్), మహిళల విభాగంలో బిలాయ్ స్టీల్స్ (ఛత్తీసగఢ్) జట్లు విజేతలుగా నిలిచాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ మంగళవారం వివరాలు వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఫైనల్ పోటీల్లో విజేతగా పురుషుల విభాగంలో ప్రథమ స్థానం హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఆర్టిలేరి, ద్వితీయ స్థానం కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (హైదరాబాద్), తృతీయ స్థానం రామచంద్రపురం జట్టు, నాలుగో స్థానం హైదరాబాద్ డీబీపీ జట్టు కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో మొదటి స్థానం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిలాయ్ స్టీల్స్ జట్టు, ద్వితీయ స్థానం రామచంద్రపురం మహిళా జట్టు, మూడో స్థానం హైదరాబాద్‌కు చెందిన డిఫెన్స్ జట్టు, నాలుగో స్థానం ఏలూరు జట్లు నిలిచాయి. కాకినాడ సత్య స్కాన్ సెంటర్ అధినేత కాదా వెంకటరమణ, డాక్టర్ సి.స్టాలిన్, గన్నమని చక్రవర్తి, ఆర్టోస్ ఎండీ అడ్డూరి సంతోష్ వర్మ, డాక్టర్లు సి. రామారావు, సి.కవిత, డాక్టర్ కె.వి.ఎస్‌సతీష్, అసోసియేషన్ సభ్యులు విజేత జట్లకు బహుమతులు అందించారు.

తదుపరి సినిమా ప్రభాస్‌తో..డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా



అంతర్వేది, జనవరి 16: స్టార్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా మంగళవారం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది విచ్చేశారు. ముందుగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామిని స్నేహితులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నాచెల్లెల గట్టు, బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాలను సందర్శించారు. బీచ్ వద్ద ఆయన్ను తదుపరి సినిమా ఎవరితో అని అడగ్గా ప్రభాస్‌తో భారీ ప్రాజెక్టు చేయనున్నట్టు చెప్పారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తానన్నారు. ఇటీవల యానిమల్ సినిమా సూపర్ హిట్ అయిందని, దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ ఖాళీ సమయంలో ఇలా పుణ్యక్షేత్రాలు దర్శనం, విహార యాత్రలు చేస్తుంటానన్నారు. కోనసీమలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్నానని, ఇంతటి చక్కటి అందమైన వాతావరణం మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిచ్చిందని సందీప్‌రెడ్డి వంగా చెప్పారు.

కోస మాంసం డిమాండే వేరు

కోడి ధర రూ.6 వేలు వరకు పలుకుతున్న వైనం

సామర్లకోట, జనవరి 16: కోడి పందాలలో ఓడిన కోడి మాంసాన్ని కోస మాంసం అంటారు. ఈ మాంసానికి ఆయా కోడి పందాల బరుల వద్ద ఎంతగానో డిమాండ్ ఉంటుంది. ఆయా కోడి పందాల వద్దే పందాలలో ఓడిన కోడిని వెంట్రుకలు కాల్చి, ముక్కలుగా కొట్టి కోసమాంసంగా తయారుచేసే పనివారు సైతం అందుబాటులోనే ఉంటారు. పందాలలో ఓడిన కోస కోడిపుంజు రెండు కిలోల బరువు వుంటే దాని ధర రూ. 6 వేలు ఉంటుంది. ఇక మాంసం కొట్టేందుకు ఒక్కొక్కదానికి రూ. 200 వసూలు చేస్తున్నారు. పందాలు మండలంలోని మూడు ప్రధాన గ్రామాలలో భారీ పందాలు, అయిదు చిన్న గ్రామాలలో చిన్న మాదిరి పందాలలో సుమారు 400 కోసలు సేకరించి బహుమతులుగా పంపారు. మండలంలోని ఒక ప్రధాన గ్రామంలో సుమారు 140 కోసల మాంసాలను రాజకీయ నాయకులకు, అధికారులకు, పోలీసులకు నజ రానాలుగా పంపినట్లు సమాచారం. పందాలలో పాల్గొనే కోడిపుంజులను పండుగ రోజులకు సుమారు మూడు నెలల ముందునుంచీ బాదంపప్పు, పిస్తాపప్పు, గుడ్లు, జీడిపప్పు, బలవర్ధక మాత్రలు తదితర అధిక పోషక విలువలు ఉండే ఆహారాన్ని పెడతారనే ప్రచారం ఉండడంతో పండుగ రోజులలో కోసమాంసం రుచులను ఆస్వాదించేందుకు ప్రతీఒక్కరూ ఆసక్తి కనబరుస్తారు.

మంత్రి రాజా, ఎమ్మెల్సీ కుడుపూడి వేధిస్తున్నారు

న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం

బాధితురాలు రాజులపూడి ఆరుద్ర

సర్పవరం జంక్షన్, జనవరి 16: అనారోగ్యంతో బాధపడుతున్న దివ్యాంగురాలైన కుమార్తెకు వైద్యం చేయించేందుకు సొంత స్థలం విక్రయంలో మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్ అడ్డుతగులుతున్నాడు. న్యాయం కోసం సీఎంవోకు వెళ్లినా న్యాయం జరగలేదు. ఏపీలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. దివ్యాంగురాలికి రక్షణ, న్యాయం కల్పించలేని ప్రభుత్వం న్యాయం కోసం వెళితే పిచ్చాసుపత్రిలో చేర్పించారు. మంత్రి రాజా, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ వేధింపులకు పాల్పడుతున్నారు. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో వచ్చి స్టేట్‌మెంట్లు అంటూ వేధిస్తున్నారు. గత్యంతరం లేక కాశీకి వచ్చి తలదాచుకుంటున్నాను' అంటూ కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు రాయుడుపాలెంకు చెందిన బాధితురాలు రాజులపూడి ఆరుద్ర మంగళవారం సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది. దివ్యాంగురాలైన తన కుమార్తె సాయిలక్ష్మీచంద్ర వెన్నుముక సమస్యతో బాధపడుతోందని ఇల్లు అమ్మి వైద్యం చేయించాలని చూస్తే మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్ అడుగడుగునా అడ్డుతగిలి ఇబ్బందులు సృష్టిస్తున్నాడని వాపోయారు. నవంబరు 2023లో సీఎంని కలిసేందుకు ప్రయత్నించినా కుదరకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించానని చెప్పారు. న్యాయం కోసం పోరాడితే పోలీసులతో అధి కారులు బలవంతంగా పిచ్చాసుపత్రిలో చేర్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం కోసం చంద్రబాబు, పవన్ డీజీపీకి లేఖ రాశానని చెప్పారు. అయినా న్యాయం జరగలేదన్నారు. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు



స్వామివారిని దర్శించుకున్న చక్రవర్తి కుటుంబం

అన్నవరం, జనవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్ చక్రవర్తి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ఏజెన్సీ సమాచారం

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

చింతూరు, జనవరి 16: చింతూరు, రంపచోడవరంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. చింతూరులో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో సకాలంలో మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేక పలువురు మృతి చెందుతున్నారన్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలన్నారు. ఫిబ్రవరి 9, 10, 11 తేదీలలో చింతూరులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతృత్వంలో జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనంతో పాటు 5వ రేల పండూంని నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేందుకు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 9642067386, 9502869683 మొబైల్ నంబర్లను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, గ్రామ పెద్దలు మడివి కన్నారావు, మడకం లక్ష్మణరావు, మడకం సత్యనారాయణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మోతుగూడెం, జనవరి 16: మోతుగూడెం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ సీఈ బొడ్డు శ్రీధర్, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ మీనా సుజాత, వార్డు మెంబరు మల్లూరు రమాదేవి, జెన్‌కో లోయర్ సీలేరు స్పోర్ట్స్ కార్యదర్శి సతీష్ రాఘవన్, జాయింట్ కార్యదర్శి జాజుల రత్నాకర్ తదితరులు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 జట్లు పాల్గొంటున్నాయని ఆంధ్రా, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రహీం, రాంబాబు, ఏసు, కిరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చింతూరు, జనవరి 16 : రోడ్డు ప్రమాదంలో చింతూరుకు చెందిన యువకుడు అంగర ప్రశాంత్ (22) మంగళవారం మృతి చెందాడు. ప్రశాంత్ మూడు రోజుల క్రితం రాజమండ్రి నుంచి చింతూరుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో చింతూరు మండలం, పోతనపల్లి సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ప్రశాంత్ కుటుంబీకులు చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రశాంత్ మంగళవారం మృతి చెందాడు.

'షర్మిల రాకతో కాంగ్రెస్ బలోపేతం'

చింతూరు, జనవరి 16: కాంగ్రెస్ పార్టీలోకి షర్మిల రాక, ఆమెకు కీలక పదవినివ్వడంతో ఏపీలో కాంగ్రెస్ మరింత బలోపేతం కానుందని పీసీసీ డెలిగేట్ ఎండీ హబీబ్ అన్నారు. చింతూరులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షునిగా విధులు నిర్వర్తించిన గిడుగు రుద్రరాజు తన పదవీ కాలంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఆమె కృషి చేయాలని కోరారు.

పండుగ వేళ పర్యాటక కళ



జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం, జనవరి 16: సంక్రాంతి పండుగ పురస్కరించుకని మన్యంలో అన్ని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో పోటెత్తాయి పండుగ సెలవులు కావడంతో సాధారణం కంటే రెట్టింపు పర్యాటకులు తరలివచ్చారు. దీంతో జలపాతాలు వద్ద రద్దీ ఏర్పడింది. ఎక్కువ మంది ప్రైవేట్ వాహనాల్లో రావడంతో పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సెలవులు పూర్తయ్యే వరకు ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకులు సంక్రాంతి పండుగను సరదాగా జరుపుకున్నారు.



పాపికొండల సందర్శనకు వచ్చిన పర్యాటకులు

పాపికొండల సందర్శనకు..

దేవీపట్నం, జనవరి 16: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నుంచి పాపికొండల అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు పాపికొండల విహారయాత్రకు వెళ్లారు. మండల పరిధిలో ఉన్న పోచమ్మగండి బోట్ పాయింట్ నుంచి గోదావరి పరివాహక ప్రాంతాలు దేవీపట్నం, పూడుపల్లి, మంటూరు కొండ మొదలు తదితర గ్రామాల మీదుగా 14 బోట్లలో సుమారు వెయ్యి మంది పర్యాటకులు వెళ్లారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలలో పేరంటాలపల్లి, పోచమ్మగండి వద్ద పర్యాటకులు సందడి చేశారు. బుధవారం కూడా 14 బోట్లలోకి పర్యాటకులు టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకున్నారు.



పతంగులు ఎగురవేస్తున్న అంగన్వాడీలు

నేటి నుంచి నిరవధిక నిరాహార దీక్షలు

బిక్కవోలు, జనవరి 16: తమ సమస్యల పరిష్కారం కోసం 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు అంగన్వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.మార్తమ్మ తెలిపారు. మంగళవారం ఆమె బిక్కవోలులో సమ్మె చేస్తున్న అంగన్వాడీల శిబిరాన్ని సందర్శించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం విరమించేది లేదన్నారు. అంగన్వాడీల సంఘీభావం కోసం సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం కనుమ పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేశారు. కార్యక్రమంలో రంగంపేట ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. వెంకటలక్ష్మి, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ముగ్గులు వేసి అంగన్వాడీల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 16: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు ప్రారంభించిన నిరవధిక సమ్మెలో భాగంగా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సంక్రాంతి ముగ్గులు వేసి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాజమహేంద్రవరం ప్రాజెక్టు కార్యదర్శి సునీత మాట్లాడుతూ 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా బెదిరింపులకు దిగడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌కు జీవిత ఖైదు తప్పదు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబుపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా దూది పింజల వలె ఎగిరిపోతాయని ప్రస్తుతం న్యాయస్థానాల్లో జరుగుతున్న పరిణామాలే దీనికి నిదర్శనమని, అసలైన అవినీతిపరుడైన సీఎం జగన్‌కు జన్మ జన్మల జీవిత ఖైదు తప్పదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తిలోని పార్టీ జిల్లా వాణిజ్య విభాగం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించిన సీఐడీ ఇప్పటివరకు ఒక్క ఆధారం కూడా చూపలేకపోయిందని, చార్జిషీటు కూడా దాఖలు చేయలేని పరిస్థితిలో ఉందన్నారు. ఏ తప్పు చేయని చంద్రబాబును అన్యాయంగా జైలుకు పంపిన జగన్‌రెడ్డి తగిన మూల్యం చెల్లిస్తారన్నారు. కోడికత్తి పేరుతో శ్రీనును ఐదేళ్లుగా జైలులో మగ్గేలా చేశారని ఆ కన్నతల్లి శాపం ఊరికే పోదన్నారు. అవినీతి చేసిన వైసీపీ నేతలు జైలుకెళ్ళడం ఖాయమన్నారు. సమావేశంలో తమలంపూడి సుధాకరరెడ్డి, నూతిక బాబూ రావు, కర్రి వెంకటరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, సబ్బెళ్ళ సత్యనారాయణ రెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, అన్నవరం పాల్గొన్నారు.

తీర్పు మాత్రమే ఆలస్యం: ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 16: న్యాయస్థానం ఇచ్చే తీర్పు ఆలస్యం కావచ్చు కానీ చివరకు న్యాయమే గెలిచి తమ అధినేత చంద్రబాబుపై అన్యాయంగా పెట్టిన అక్రమ కేసుల నుంచి ఆయన కడిగిన ము త్యంలా బయట పడతారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై ఆదిరెడ్డి వాసు పైవిధంగా స్పందించారు. సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పు పాక్షిక విజయంగా భావిస్తున్నామన్నారు. రాజకీయ ప్రేరేపిత కేసు కాబట్టి తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందన్నారు.

కోడి పందాల జోరు

- చేతులు మారిన లక్షలాది రూపాయలు
- బరుల వద్ద గుండాట, పేకాట
- కోసకు పోటీ పడిన మాంసం ప్రియులు



అనపర్తిలో గుండాట నిర్వహిస్తున్న దృశ్యం

అనపర్తి/గోకవరం/కడియం/కోరుకొండ, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు కోడి పందాలు జోరుగా జరిగాయి. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పలు గ్రామాల్లో కోడి పందాల బరులు నిర్వహించగా అనేక మంది పందెంరాయుళ్ల కోళ్లకు కత్తులు కట్టి వేలల్లో పందాలు నిర్వహించారు. అలాగే పలు చోట్ల బహిరంగంగానే గుండాటలు ఏర్పాటు చేసి కాయ్ రాజా కాయ్ అంటూ పందాలు నిర్వహించారు. బరులు ఏర్పాటు చేసిన ప్రాంగణం వద్ద మద్యం ఏరులై పారింది. నిన్న మొన్నటి వరకు జూదాలు, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన పోలీసులు చివరకు ప్రేక్షక పాత్ర వహించారు. అనపర్తి మండలంలో సుమారుగా ఆరు చోట్ల బరులు నిర్వహించారు. కోస మాంసం కోసం అనేక మంది పోటీ పడ్డారు. గోకవరం మండలం గోకవరం, కృష్ణునిపాలెం, వీరలంకపల్లి, కొత్తపల్లి, కామరాజుపేట, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి. పోలీసుశాఖ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో పందెంరాయుళ్లు ఉత్సాహంతో పందాల్లో పాల్గొన్నారు. ఆసక్తి ఉన్నవారు గుండాటల్లో లక్షలాది రూపాయలను చేజార్చుకున్నారు. కడియం మండలంలో వీరవరం, బుర్రిలంక గ్రామాల్లో కోడి పందాలు యథేచ్ఛగా సాగాయి. కోరుకొండ మండలంలో మధురపూడి, కాపవరం, గాదరాడ, బూరుగుపూడి, నిడిగట్ల, కణుపూరు, కోటి, శ్రీరంగపట్నం, రాఘవపురం గ్రామాల్లో కోడిపందాలు భారీగా జరిగాయి. వీటితోపాటు గుండాట, పేకాట నిర్వహించారు. పందాలు ఆర్గనైజింగ్ చేయడంలో ఆరితేరిన వ్యక్తులను రాష్ట్ర నలుమూలల నుంచి రప్పించారు.

రాజానగరంలో సంక్రాంతి సంబరాలు



చక్రద్వారబంధంలో విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

రాజానగరం, జనవరి 16: సంక్రాంతి సంబరాలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. రాజానగరం అన్నదాన సత్రంలో మండల ఆర్యవైశ్య సంఘం, రోటరీ ఐకాన్ సహకారంతో సోమవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది పిల్లలకు భోగిపళ్లు పోశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తీగల రాజు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే చక్రద్వారబంధంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. శ్రీసీతా రామాంజ నేయ బాలభక్త భజన సమాజం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో సుమా రు 60 మంది మహిళలు పాల్గొన్నారు. తోకాడ గ్రామానికి చెందిన ఉద్దంటి సంధ్యకు ప్రథమ, కానవరం గ్రామానికి చెందిన సోడసాని నాగేశ్వరికి ద్వితీయ, దాయన రాజకుమారికి తృతీయ బహుమతులు దక్కాయి. న్యాయ నిర్ణేతలుగా లక్ష్మీ నరసింహస్కూల్ కరస్పాండెంట్ బి.ప్రసాద్, నరేంద్రపురం మార్గదర్శి స్కూల్ కరస్పాండెంట్ శేషారావు వ్యవహరించారు.

మర్రిపూడిలో వృద్ధులకు పోటీలు



భోగి మంటకు వందనం చేస్తున్న వృద్ధులు

రంగంపేట జనవరి 16: మండలంలోని మర్రిపూడిలో ఉత్తమోపాధ్యాయ అవార్డు గ్రహీత పుట్టా సోమన్నచౌదరి ఆధ్వర్యంలో వృద్ధులకు పోటీలు నిర్వహించారు. 20 మంది వృద్ధులను ఎంపిక చేసి వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముందుగా 65 ఏళ్ల పైబడిన వారు భోగి మంటకు వందనం చేసి సంకీర్తనలను ఆలపించారు. అనంతరం వారితో తాడు లాగడం, బరువులు విసరడం, ఎడమ చేతితో కొబ్బరికాయలు కొట్టడం వంటి క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా 92 ఏళ్ల వృద్ధుడు కిలోమీటర్ దూరం వేగంగా సైకిల్ తొక్కాడు. అలాగే చిన్నారులకు కూడా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

జగమే రామమయం: సంజీవరావు



రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 16: రాముని ధర్మాచరణను ప్రజఒక్కరూ స్వానుభవంలోకి తెచ్చుకున్న రోజున జగమే రామయం అవుతుందని కళాగౌతమి అధ్యక్షుడు డా. పీవీవీ సంజీవరావు పేర్కొన్నారు. ఎస్‌కేవీటీ కళాశాలలో కందుకూరి తెలుగు నాటక నిలయంలో ఏర్పాటు చేసిన నెలవారీ రచయితల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాముని జీవితం ఆదర్శంగా తీసుకుంటే ధర్మం నలుదిశలా విరాజిల్లుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాన వక్త డా. తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ శివకేశ అభేదాన్ని పాటించే తారక మంత్రమే రామ శబ్దమన్నారు. ముందుగా అయోధ్య రామమందిరం నమూనాకు సభ్యులందరూ నమస్సుమాంజలి అర్పించారు. చెరుకుపల్లి గాంగేయశాస్త్రి రాసిన 'అయోధ్య రాముని నవగేయ మాలిక పాటలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీవీ సుబ్రహ్మణ్యం, అయ్యగారి కోదండరావ్, బూడిద వీర్రాజు, సీరా గంగాధర్, ముంగండి సూర్యనారాయణ, కె.విద్య, చీరల సీతారామనాయుడు పాల్గొన్నారు.

జంబుపట్నంలో లక్ష్మీనరసింహుడి గ్రామోత్సవం

కోరుకొండ, జనవరి 16: జంబుపట్నంలో ఏడాదికోసారి జరిగే కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం మంగళవారం (కనుమ పండుగ రోజున) ఘనంగా జరిగింది. అంతకుముందు గ్రామ పెద్దలు స్వామి ఆలయానికి వచ్చి పులిహోర భోగం చేయించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పల్లకిలో లక్ష్మీదేవితో కలిసి జంబూపట్నం బయల్దేరారు. ఈ సందర్భంగా 3 కిలోమీటర్ల మేర కోరుకొండ, పశ్చిమగోనగూడెం, జంబుపట్నం గ్రామాల ప్రజలు రోడ్లపై రంగ వల్లులు వేసి మంగళ హారతులతో స్వామికి స్వాగతం పలికారు. జంటూపట్నంలో ఆడపడుచులంతా స్వామికి పండ్లు, బియ్యం సమర్పించారు. జమిందార్ వుల్లి గోపయ్య ఇంటి వద్ద స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వుల్లి అప్పన్నదొర, రొంగల దేవిక, నాయకులు వుల్లి బుజ్జిబాబు, నాగా సత్యనారాయణ, నాగా రమేష్, కాండ్రేగుల కృష్ణ, వుల్లి చల్లారావు, వుల్లి పట్టాభి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశ్వర్లు



పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన వెంకటేశ్వర్లు

కడియం, జనవరి 16: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కడియం పల్ల వెంకన్న నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఏరియర్లు, బకాయిలు, సొమ్ములను ప్రభుత్వం సత్వరం చెల్లించాలని కోరారు. ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయ ఆందోళన కార్యక్రమంపై పోలీసు నిర్బంధాలు ప్రజాసామ్యం కాదని విమర్శించారు. 12వ పీఆర్సీ కార్యక్రమాలను ప్రభుత్వం త్వరగా ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు, ఉంగరాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరువాభరణోత్సవం



రాజమహేంద్రవరం లో తిరువాభరణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 16: రాజమహేంద్రవరం పురవీధులు అయ్యప్ప నామస్మరణ, శరణాలతో మారుమోగాయి. తిరువాభరణోత్సవం వైభవంగా జరిగింది. అడుగడుగునా భక్తులు నీరాజనం పట్టారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ఇంటి వద్ద తిరువాభరణానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేశ్ తిరువాభరణాలను తలపై పెట్టుకుని కేరళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అయ్యప్ప ఆలయానికి చేరుకొన్నారు. స్వామివారికి వాటిని అలంకరింపజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మకరజ్యోతి దర్శనమిచ్చింది. ఈ ఉత్సవాల్లో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, డాక్టర్ అనసూరి పద్మలత తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో రంగవల్లుల పోటీలు

అనపర్తి, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా అనపర్తిలోని పాత బాప నమ్మ ఆలయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహిం చారు. దీనికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతి థిగా విచ్చేశారు. అలాగే పేదలకు ఆయన చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అనపర్తి, జనవరి 16: అనపర్తిలోని జీబీఆర్ జూనియర్ కళాశాలలో 1998-2000 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థుల సమ్మేళనం మంగళవారం అదే కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలో కలియతిరుగుతూ ఆనాటి సంగతులను, అల్లరి చేష్టలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు.

వాడపల్లిలో ఎస్పీ జగదీష్ పూజలు



ఎస్పీ జగదీష్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 16: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఎస్పీ పి.జగదీష్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీస్సులతో పాటు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎస్పీ వెంట ఆత్రేయపురం ఎస్ఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.

షర్మిల నియామకం కాంగ్రెస్‌కు శుభపరిణామం

కడియం/రాజమహేంద్రవరంరూరల్, జనవరి 16: ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియమితులవ్వడం కాంగ్రెస్ పార్టీకి శుభపరిణామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాడాల కొండ్రాజు, రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రెండు సార్లు కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టిందని, ఆయన తనయురాలు షర్మిల ఆధ్వర్యంలో పార్టీ బలోపేతమవుతుందని, రాబోవు రోజుల్లో కాంగ్రెస్ విజయం సాధించి పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన కేడర్ మరలా రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. షర్మిలను ప్రత్యక్షంగా కలిసి పార్టీ కార్యాచరణపై చర్చించి రాబోయే ఎన్నికల్లో గెలుపుబాటలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



బిక్కవోలులో సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు

బిక్కవోలు, జనవరి 16: గ్రామంలోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. కనుమ పండుగ, స్వామికి ప్రీతికరమైన మంగళవారం, స్వామి జన్మనక్షత్రమైన షష్ఠి తిథి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. ఉదయం నుంచి బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు కుజ, రజ, కాల, సర్ప దోష నివారణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో దేవదాయశాఖ ఆధ్వర్యంలోను, అలాగే స్థానిక అన్నదాన సత్రంలో భక్తులకు ఉచితంగా అన్నదాన ఏర్పాట్లు చేశారు.

కొంకుదురులో ఆన్‌లైన్‌లో ముగ్గుల పోటీలు

బిక్కవోలు, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా కొంకుదురులో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణిరాజా, ఎంపీటీసీ పీవీ, మాజీ సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వీరుళ్లమ్మ జాతర ఉత్సవాలు

అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



వీరుళ్లమ్మను ఎమ్మెల్యే దంపతులతో కలిసి దర్శించుకుంటున్న హైదరాబాద్ యశోద హాస్పిటల్ డాక్టర్ దశరథరామారెడ్డి

అనపర్తి, జనవరి 16: అనపర్తి గ్రామ దేవత వీరుళ్ళమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి జాతర ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు గరగలనెత్తి ఉత్సవాలను ప్రారంభించారు. జాతరలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలకంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పోటీలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా హైదరాబాద్ యశోద ఆసుపత్రి ఆర్థోపెడిక్ చీఫ్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథరామారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన డీఐజీ వెలివెల సత్యనారాయణ, నటి శ్రీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. బుధ, గురువారాల్లో కూడా అమ్మవారి తీర్థ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, పడాల కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సైంధవ్
సూర్యామినీ	: నా సామి రంగ
సూర్యాప్యాలస్	: గుంటూరు కారం
స్వామి	: గుంటూరు కారం
శివజ్యోతి	: సైంధవ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: హనుమాన్
రంభ	: నా సామి రంగ
మేనక	: హనుమాన్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: హనుమాన్
వీఎస్ మహల్ (నామవరం)	: హనుమాన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: నా సామి రంగ
వెంకటసూర్య(కడియం)	: హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	: గుంటూరు కారం
సూర్యశ్రీ (అనపర్తి)	: గుంటూరు కారం
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గుంటూరు కారం
రామకృష్ణ(కోరుకొండ)	: సైంధవ్
గీతాసినిమాస్ (సీతానగరం)	: సైంధవ్
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: గుంటూరు కారం
లలితామహల్(రంపచోడవరం)	: సైంధవ్
నవయుగ(చింతూరు)	: హనుమాన్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 17 జనవరి 2024 | 5



కోట్లాట!





పిడింగొయ్యిలో బరి వద్ద గుమిగూడిన జనం.. కాళ్లు దువ్వుతున్న కోళ్లు



కత్తి.. కట్టి..



పోరాడి..ఓడి : నల్లజర్లలో బరిలోనే ప్రాణాలొదిలిన కోడి

కత్తి దిగింది.. రక్తం చిందింది!

రాజమహేంద్రవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కోడి పందేల విషయంలో ఈ ఏడాదీ అదే బొమ్మ పడింది. పండుగకు వారం ముందు జూలు విదిల్చిన నాలుగో సింహం చతికిల పడక తప్పలేదు. దీంతో మళ్లీ యంత్రాంగంపై పందెం పుంజు పైచేయి సాధించింది. ప్రతి ఏడాదీ జనాలకు అలవాటైపోయిన తంతే అయినా.. ఈసారి పోలీసుల దూకుడు చూసి పందెం బరుల పనైపోయిందనే చర్చ నడిచింది. పందెం బరులను ధ్వంసం చేయడం, కోడి పందేల జోలికెళ్తే జైలు తప్పదనే అత్యంత కఠినమైన హెచ్చరికలు చూసిన జనం నిజంగా నిజం కాబోలు అనుకున్నారు. శ్రమకోర్చి జిల్లాలో ఓ వెయ్యిలోపు కోడి కత్తులు స్వాధీనం చేసుకోవడంతో ఈసారి పందెం పుంజు తోకముడవక తప్పదనుకున్నారు. కానీ.. చివరికి కేసులు.. కాసులు.. కోసలు హల్‌చల్ చేశాయి. జాతి వైరం మాటున జరుగుతున్న హింసాక్రీడలో వందలాది మూగజీవాల రక్తంతో బరులు తడిచి ముద్దయ్యాయి. గుండాట, పేకాట తదితర జూదాలపై కూడా ఈ మూడు రోజులు చట్టం ముఖం చాటేసింది. సంక్రాంతి వచ్చిం దంటే గోదావరి జిల్లాల్లో కోడి పందేలు ఆపడం ఎవరికీ సాధ్యం కాదనే విషయం మరోసారి రుజువైంది. గతంలో చాటుమాటుగా పందేలు జరిగేవి ఇప్పుడు ప్రధాన రహదార్ల పక్కనే బరులు ఏర్పాటు చేస్తుంటే పోలీసులు కాపలా కాయాల్సిన దుస్థితి దాపురించింది. ఈసారి జిల్లాలో రూ.100 కోట్లపైనే కోడి పందేలపై డబ్బు చేతులు మారగా.. గుండాట, పేకాట, మూడు ముక్కలాట వంటి క్రీడల్లో జనం మరో రూ.10కోట్ల వరకూ పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది.





గోపాలపురంలో కోళ్లను పందేనికి తీసుకెళుతున్న బాలుడు

'బరి' తెగించి.. కత్తులు నూరేశారు!

- జిల్లాలో వెలిసిన 100 బరులు
- రెచ్చిపోయిన పందెంగాళ్లు
- వేలు..లక్షల్లోనే సాగిన పందేలు
- రూ. 100 కోట్లు ఆడేశారు..
- జోరుగా గుండాట, కోతాట
- యథేచ్ఛగా మందు.. విందు.. పసందు
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే బరులు
- కళ్లు మూసుకున్న అధికారులు
- మామూళ్ల మత్తులో పోలీసులు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

సై అంటే సై.. ఎంతైనా ఓకే.. పండుగ సందడిలో బరి తెగించారు.. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ బరులు వెలిశాయి. కోట్లాట హోరెత్తింది.. బరిలో కోళ్ల కత్తులు దూశాయ్.. నువ్వా నేనా అంటూ తలపడ్డాయ్.. యజమానులను గెలిపించాలని రక్తం చిందించాయ్..మూడు రోజుల కిందట సంక్రాంతి పందెం కోడి పోలీసులపై నెగ్గినట్టు కనిపించినా.. చివరికి బరిలో తుదిశ్వాస విడిచి ఓడిపోయింది. మూడు రోజుల కిందటి వరకూ ప్రగల్భాలు పలికిన పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇచ్చింది పుచ్చుకుని ప్రేక్షకపాత్రకే పరిమితమయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రూ. కోట్లలో కోడిపందాలు, గుంటాటలు , పేకాటలు, మూడు ముక్కలాటలు జరిగాయి. ఎన్నికల ఏడాది కావడంతో నాయకులు సైతం అడిగినవారికి కాదనుకుండా బరులకు అనధికార అనుమతులిచ్చేశారు..మేమున్నాం మీరు వేసుకోండి అంటూ వెన్నుదన్నుగా నిలిచారు. గత మూడు రోజుల నుంచి వైసీపీ ప్రముఖులే కీలక పాత్ర పోషించారు. దీంతో పందేలు జోరుగా సాగాయి. ఎన్నడూ లేనిది జిల్లా కేంద్రం చుట్టు పక్కల భారీగా బరులు వెలిశాయి. పోలీసులు బరికి రూ.లక్షల్లో తీసుకొని ఇళ్లలో పడుకున్నట్టు విమర్శలు వచ్చాయి. సంక్రాంతికి ముందు పందెం ఆడనిచ్చేలేదని చెప్పి విస్తృత ప్రచారంచేసి, అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు. అయితే భోగి పండుగ మధ్యాహ్నం 12 గంటల మొదలు కనుమ వరకూ ఎక్కడా కనిపించలేదు. పబ్లిక్‌గా రోడ్ల ప్రక్క, ఊళ్ల మధ్యన బరులు వేసి రాత్రి పగలూ పందాలు నిర్వహించినా ఎవరూ ఆపే ప్రయత్నం కూడా చేయలేదు. జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో ఒక్కో మండలంలోనూ కనీసం రెండు నుంచి పది వరకూ బరులు వెలిశాయి. మొత్తంగా జిల్లాలో 80 నుంచి 100 బరులు వరకూ ఏర్పాటు చేసినట్టు అంచనా. గోకవరం మండలంలో భారీస్థాయిలో కోడిపందేలు నిర్వహించారు. ఒక్కో చోట కనీసం 20 పందేల నుంచి 50 వరకూ జరిగాయి. వీరలంకపల్లిలో భారీ బరి ఏర్పాటు చేశారు. వందలాది మంది పందెగాళ్లు కార్ల మీద ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చారు. ఒక్కో పందెం రూ. లక్ష వరకూ సాగింది. ఎల్ ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి, బయట జనానికి కూడా స్పష్టంగా కోళ్ల కొట్లాట కనిపించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సారి బరులు హైటెక్ స్థాయిలో ఏర్పాటు చేశారు. టెంట్ , ఫెన్సింగ్ ఏర్పాటు చేసి లోపలకు కొంతమందిని మాత్రమే అనుమతించారు. టికెట్లు కూడా పెట్టారు. అచ్చుతాపురంలో స్థానికులు పందాలు వేశారు. గోకవరం,కృష్ణునిపాలెం, కొత్తపల్లి, మల్లవరం,తిరుమలాయపాలెం, రంప ఎర్రంపాలెం, వెదురుపాక, తంటికొండ ప్రాంతాల్లో జోరుగా పందాలు, గుండాటలు సాగాయి. ఒక్కో పుంజు తరఫున రూ.లక్ష వరకూ పందెం జరగగా..బయట పందేలు వేలల్లో జరిగాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో పిడింగొయ్యిలో పెద్దపందెం వేశారు. పందెం ఒకటి రూ.లక్ష. రాత్రి పగలూ కూడా ఆడేస్తు న్నారు. కవలగొయ్యిలో కూడా గట్టిగా ఆడారు. కడియం మండలంలో వీరవరం, బుర్రిలంక గ్రామాల్లో కోడి పందేలు సాగాయి. అనపర్తి, రంగంపేట, బిక్కవోలులో అనేక చోట్ల పెద్ద పందాలు జరిగాయి. సీతానగరం మండలంలో వైసీపీ రెండు వర్గాలు చీలి రెండు బరులు పెద్దవి నిర్వహించింది. రూ.లక్షలు చేతులు మారాయి.కోరుకొండ, రాజానగరం మండలాల్లో అధికంగా జరిగాయి. రాజానగరం మండలం పుణ్యక్షేత్రంలో పెద్ద బరి ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ వేలాదిగా జనం వచ్చి పందేలను తిలకించారు. గోపాలపురం మండలంలో గోపాలపురం,వేళ్లచింతలపూడి, వెంకటాయపాలెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, దొండపూడి, హుకుంపేట, గ్రామాల్లో రూ.కోట్లలో పందేలు జరిగాయి. కొవ్వూరు, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, చాగల్లు, తాళ్లపూడి, నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో అత్యధికంగా పందాలు జరిగాయి. జిల్లాలో సుమారు 80 నుంచి 100 వరకు బరులు ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు బందోబస్తు చర్యలు చేపట్టారు.సుమారు రూ.100 కోట్ల వరకూ పందెం, గుంటాలు జరిగినట్టు చెబుతున్నారు. సందట్లో సడేమియాగా మద్యం వ్యాపారం జోరుగా సాగింది. పందెం దగ్గర అందరూ ఊగేవాళ్లు, తూగేవాళ్లే. చుక్కేసి ముక్కేసి ఆడేశారు. అయినా పోలీసులు మాత్రం పట్టించుకోలేదు. కోడి పందేల ముసుగులో జూదం భారీగా సాగింది. ఎక్కడికక్కడ బెల్ట్ షాపులు వెలిసినా ఎస్ఈబీ అధికారులు నోరుమెదపకపోవడం గమనార్హం.గుంటాటలు కనీసం రూ.100 కాస్తేనే కానీ అనుమతించలేదు. ఎక్కువ మంది రూ.500 నుంచి వేలల్లో కాశారు. గుంటాట నిర్వాహకులు, పందెం నిర్వాహకులు భారీగా సంపాదించారు. ఎన్ని కల ముందు సంక్రాంతి కావడంతో రాజకీయనేతలంతా లోపాయికారిగా సహకరించి పందేలు వేయించారు. పోలీసు లకు కూడా భారీగా ముడుపులు అందినట్టు నిర్వాహకులే చెబుతున్నారు.ఈ మూడు రోజుల్లో ఎక్కడా ఒక కేసు నమోదు చేసినట్టు లేదు. వందల్లో బరులు ఏర్పాటు చేసి.. రూ.కోట్లల్లో జూదక్రీడ రెచ్చిపోగా.. కొన్ని కేసు లు పెట్టి ఈ ఏడాది చేతులు దులుపుకునే పనిలో పడ్డారు. ప్రజాప్రతి నిధుల అధికార దండం ముందు జిల్లా పోలీస్ బాస్ చేతులు కట్టుకోక తప్పలేదు. కోడి పందేల విషయంలో కోర్టు ఆదేశాలనే పాటిస్తామని స్పష్టంగా చెప్పిన మాటలనూ పక్కన పెట్టేయక తప్పలేదు.

కేసులు.. కాసులు.. కోసలు

జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషను పరిధిలోనూ కోడి పందేలు జరిగాయి. పెద్ద బరుల్లో కోట్లాది రూపాయల్లో జూదం ఆడారు. కోడి పందేలు ఆపడం సాధ్యం కాదనే విషయం యంత్రాంగానికి అనుభవంలో ఉండడంతో ఉభయ కుశలోపరి కింద ప్రజాప్రతినిధుల సలహాలతో ఓ లోపాయికారీ ఒప్పందం నడిచింది. పోలీస్ స్టేషనుకు బరిని బట్టి కాసులు.. కేసులు.. కోశలు లెక్కన వెసులుబాటును తెరపైకి తెచ్చారు. కనీసం మూడు కేసులు బనాయించే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అలాగే 'మామ్మూళ్లు' మామూలే. చిన్న బరికి రూ.50 వేలు పెద్ద బరి స్థాయిని బట్టి రూ.లక్ష పైనే వసూలు చేశారు. ఇక స్టేషనుకు ఇన్ని కోసలు(ఓడిపోయి చనిపోయిన పందెం పుంజు) ఇవ్వాలనే హుకుం కూడా ఇచ్చారు.అంతే కాదండోయ్ మూడు కోళ్లు పట్టుకున్నట్టు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం.



కొవ్వూరులో బరి వద్ద వాహనాలు



కొవ్వూరులో సాగుతున్న గుండాట

కోసకు డిమాండ్



నల్లజర్ల/ గోపాలపురం/ కొవ్వూరు : పందెంలో ఓడిన కోడి(కోస)కు డిమాండ్ పెరిగింది.కనుము కావడంతో కోసాకు జనం పరుగులు తీశారు.రెండు కేజీలు ఉన్న కోస మాంసం రెండు వేల ఉంచి 3 వేల వరకు పలికింది.కోస మాంసానికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో నల్లజర్ల మండలం అనంతపల్లి, చోడవరం,ప్రకాశరావుపాలెం,దూబచర్లలో ఇంట్లో పెంచుకుని కోడి పుంజులను తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లేడ్‌తో కోసి వాటిని కాల్చి కోస మాంసంగా విక్రయించారు. వెయ్యి రూపాయలకు కొనుగోలు చేస్తే రెండు వేల వరకు వసూలు చేశారు. గోపాలపురం ఒక్కొక్క కోస రూ.2500 నుంచి దాని బరువును బట్టి రూ.5వేల వరకు ధర పలికింది. కొవ్వూరులో అయితే రూ.3 వేల వరకూ విక్రయించారు.

ద్వామా పీడీగా జగదాంబ తొలగింపు

రాజమహేంద్రవరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : ద్వా మా పీడీ పి.జగదాంబను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్య కుమారి ఈనెల 12న తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. కత్తిపూడి డీఎల్‌డీవోగా తిరిగి చేరవలసిందిగా ఆదేశించారు.వాస్తవానికి ఉపాధి హామీ సిబ్బంది ఆమెపై ఫిర్యాదు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్టు తెలిసింది.కొత్త జిల్లా ఏర్పడినప్పుడు మొదట కొవ్వూరు ఎంపీడీవోగా ఉండేవారు.తర్వాత డ్వామా పీడీగా బాధ్యతలు స్వీక రించి, కొద్దినెలల తర్వాత డీపీవోగా నియమితులయ్యారు. ఓ ఎమ్మెల్యే ఒత్తిడి వల్ల ఆమెను డీపీవోగా తప్పించినట్టు సమాచారం. కొద్దిరోజులు ఖాళీగా ఉన్న జగదాంబ తిరిగి ద్వామా పీడీగా ఐదు నెలల కిందట బాధ్యతలు చేపట్టారు.ఇదిలా ఉండగా పండుగ సమయంలో ఆమెను తొల గించి కత్తిపూడి డీఎల్‌డీవోగా చేరాలని ఆదేశించడం గమనార్హం.

జాతీయ కాన్ఫరెన్స్‌కు మంగారాణి



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 16 : రాజమహేంద్రవరం శ్రీ నాగరాజా స్పెషల్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణికి కేంద్రప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. కేంద్ర ప్రభుత్వం జనవరి 29 నుంచి 31వ తేదీ వరకూ న్యూఢిల్లీలోని విశ్వ యువ కేంద్రంలో నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్ జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు ఆంధ్రరాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపిక కాగా అందులో మంగారాణి ఒకరు.



సంక్రాంతిని పురస్కరించుకుని నల్లజర్ల మండలం పోతవరంలో మోతుకూరి శ్రీను కుటుంబీకులు మంగళవారం ఒకే అరటి ఆకులో 36 వంటకాలతో ఇలా భోజనం చేశారు.

పండుగ విషాదం

సంక్రాంతి పండుగ ఆనందం ఆవిరైంది.. పలు కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చింది.. మద్యం మత్తు పలువురి ప్రాణాలు తీసింది.. వెనుక నుంచి బైక్ ఢీకొట్టి ఒకరు.. ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టి మరొకరు మృతిచెందారు.. మరో యువకుడు పండుగకని మేనమామ ఇంటికి వెళుతూ బైక్ అదుపు తప్పిరోడ్డుపై పడి మృతిచెందాడు. మద్యం మత్తులో ఉన్న మరో వృద్ధుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో సజీవదహనమయ్యాడు. ఇలా వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు.. అప్పటి వరకూ తమతో ఉన్న వారు ఇక లేరని తెలిసి కుటుంబీకులు బోరుమన్నారు.

- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి
- పండుగకు వచ్చి ప్రమాదానికి గురి
- కన్నీరు మున్నీరైన కుటుంబీకులు
- 4 కుటుంబాల్లో తీవ్ర విషాదం

బైక్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

కొవ్వూరు, జనవరి 16 : పండుగకు ఆనందంగా ఇంటికి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమా దంలో మృతిచెందాడు. కొవ్వూరు పట్టణానికి చెందిన యాదం దుర్గా నాగసాయి కుమార్ (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీన ఇంటికి వచ్చాడు. 15వ తేదీన తండ్రి మోటారు సైకిల్ తీసుకుని రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని బయలుదేరాడు. ఏజీఆర్‌బీ రోడ్‌పై ఆంధ్రా ఫామ్ కెమికల్ ఫ్యాక్టరీ ఎదురుగా వెనుకనుంచి వస్తున్న బైక్ యువకుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్ కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మృతి చెం దాడు. మృతుడి తండ్రి సంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. పండుగకు వచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇక మాకు దిక్కెవరంటూ బోరుమన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..



దేవరపల్లి, జనవరి 16 : సంక్రాంతి పండుగను మావయ్య ఇంటి వద్ద జరుపు కుందామని బయలుదేరిన యువకుడు బైక్ ప్రమాదంలో మృతిచెందాడు. కోరుకొండ గ్రామానికి చెందిన పంపన విష్ణు తేజ(24) పాలిటెక్నిక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. సోమవారం ఉదయం కోరుకొండ నుంచి బైక్‌పై నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామంలో ఉన్న తన మేనమామ వద్దకు సంక్రాంతి పండుగకు బయలుదేరాడు. దేవరపల్లి మండలం యర్నగూడెం జాతీయరహదారి ఫ్లయ్ ఓవర్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. అతన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని సీఐ రామకృష్ణ పరిశీలించారు. మృతుడి మేనమామ తంగెళ్ల రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అత్తవారింటికి వస్తుండగా మరొకరు..



దేవరపల్లి, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా అత్తవారింటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. గోపాలపురం మం డలం దొండపూడి గ్రామానికి చెందిన జాలిం వంశీకృష్ణ(25) బంధువుల శుభకార్యా నికి వెళ్లి తిరిగి సంక్రాంతి పండుగ నిమిత్తం దేవరపల్లి మండలం యర్నగూడెంలోని అత్తవారింటికి బయలుదేరాడు. కాసేపట్లో అత్తవారింటికి చేరుకుంటాడనే లోపునే ప్రమాదం జరిగింది. ఎదురుగా నిర్లక్ష్యంగా, అతివేగంగా వస్తున్న బైకు ఢీకొనడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో అతడిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పట్టుకుని భార్య విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. వృద్ధుడి సజీవ దహనం

దేవరపల్లి, జనవరి 16 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వృద్ధుడు సజీవ దహనమయ్యాడు.పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామానికి చెందిన సుంకర భీమరాజు (73) తన భార్యతో 9 నెలల క్రితం దేవరపల్లి గ్రామంలో రైతు వద్ద కూలిపనికి వచ్చాడు. రైతు పొగాకు బేరన్ పక్కన ఉన్న రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మృతుడు గత మూడు రోజులుగా మద్యం సేవించి భార్యను కొడుతున్నాడు. మద్యం మా నేయాలని భార్య చెప్పినా వినలేదు.ఇదిలా ఉండగా సోమవారం రాత్రి 9 గంటలకు మళ్లీ మృతుడు విపరీతంగా సేవించి రావడంతో ఎక్కడ కొడతాడోనని భార్య భయపడి పక్కింట్లో పడుకుందన్నారు. భీమరాజు మాత్రం తన షెడ్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి సమ యంలో షెడ్ నుంచి ఒక్కసారిగా మంటలు చెల రేగాయి. రాత్రి 11 గంటల సమయంలో స్థానికులు గమనించి మంటలు ఎగడిపడుతున్నాయని కేకలు వేశారు. దీంతో భార్య బయటకు వచ్చి చూసే సరికి మంటలు ఎగసిపడుతున్నాయి. భీమరాజు మంటల్లో చిక్కుకున్నాడని భార్య బోరున విలపించింది. షెడ్డులో బేరన్‌కు సంబంధించిన పురుకూసలు ఉండడం వల్ల మంటలు మరింతగా ఎగసిపడి భీమరాజు సజీవదహన మయ్యాడని పోలీసులు తెలిపారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షెడ్డుకు మంటలు అంటుకు న్నట్టు సమాచారం.సంఘటనా స్థలాన్ని సీఐ రామ కృష్ణ, ఎస్ఐ శ్రీహరిరావు పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలి పారు.



సజీవదహనమైన మృతదేహం పరిశీలన

రూ.కోట్లలో సాగుతున్న పేకాట

మిర్తిపాడు- మధురపూడి మధ్య భారీ పేకాట శిబిరం

రాజమహేంద్రవరం, జనవరి16(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతిని పురస్కరించుకుని సందట్లో సడేమియా అన్నట్టు మధురపూడి, మిర్తిపాడు గ్రామాల మధ్య కోరుకొండ పోలీసు స్టేషన్ పరిధిలో భారీ పేకాట శిబిరం నిర్వహించారు. రాత్రి పగలూ ఒకటే ఆట. రూ.కోట్లలో పేకాట ఆడినట్టు సమాచారం.పలువురు ప్రముఖులు ఆయా ఊర్ల పెద్దలు, మోతుబరులు ఈ మూడు రోజులు పేకాటలోనే నిమగ్నం కావడం గమనార్హం. మరో పక్క మూడు ముక్కలాట, గుండాట వంటి జూదంగా భారీగా ఆడడం గమనార్హం. పోలీసులు కనీసం కన్నెత్తి చూడలేదు. ఇది రాజకీయనేతలు, పోలీసులకు తెలిసే జరిగినట్టు సమాచారం.రాత్రి వేళ భారీ లైటింగ్ ఏర్పాటు చేసుకుని జూదంలో నిమగ్నమయ్యారు. కొందరు భారీగా డబ్బు పోగొట్టుకోగా, కొందరు జేబులు నింపుకున్నారు. నిర్వాహకులు భారీ వెనకేసుకున్నట్టు చెబుతున్నారు.

జగ్గంపేట వైసీపీలో ఆధిపత్య పోరు

గోకవరం ఎస్ఐ ఆకస్మిక బదిలీ.. కొత్త ఎస్ఐగా నాగరాజు

రాజమహేంద్రవరం, జనవరి16(ఆంధ్రజ్యోతి) : గోకవరం వైసీపీలో ఆధిపత్యపోరు అక్కడ ఎస్ఐ బదిలీ అవ్వడానికి దారి తీసింది. ఇటీవల కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబును పక్కన పెట్టి ఆ నియోజకవర్గానికి మాజీ మంత్రి తోట నరసింహంను ఇన్‌ఛార్జిగా నియమించిన సంగతి తెలి సిందే.దీంతో ఆయన వర్గానికి చెందిన ఓ దళిత నేతను గతంలో ఎస్ఐ కాస్త ఇబ్బంది పెట్టారనే కారణంతో పండగ ముందు ఆకస్మికంగా బదిలీ చేయించినట్టు తెలిసింది. ఇక్కడ ఎస్ఐ యూవీ.శివనాగబాబు గతంలో ఎమ్మెల్యే చంటిబాబుకు అనుకూలంగా వ్యవహరించినట్టు సమాచారం. ఇవాళ వ్యతిరేకవర్గానికి పెత్తనం రావడంతో ఈ పరిణామం సంభవించింది. దీంతో నియోజకవర్గంలో వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇంతవరకూ తమ చేతిలో ఆధిపత్యం ఉందని విర్రవీగిన వాళ్లకు, ఇవాళ మరొకరి చేతిలోకి వెళ్లడంతో ఇబ్బందిగా ఉన్నారు. వైసీపీని వీడిపోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కొత్తగా కె.నాగరాజు ఎస్ఐగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

చంద్రవరంలో 'పల్లె పిలుస్తోంది రా!'

ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్



చంద్రవరంలో వినతులు తీసుకుంటున్న టీడీపీ ప్రొఫెషనల్స్

చాగల్లు, జనవరి 16: టీడీపీ అనుబంధ విభాగం తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో చంద్రవరంలో పల్లె పిలుస్తోంది రా కార్యక్రమం జరిగింది. తెలుగు యువత, ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు సంక్రాంతి సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడు నెలల్లో టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తుందని గ్రామ సమస్యలు తప్పక పరిష్కారవుతాయని చెప్పారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మద్దిపాటి వీరరాఘవులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్స్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి కొండయ్యచౌదరి, అన్నమరెడ్డి రాజాబాబు, ఎంపీటీసీ గారపాటి నరసింహమూర్తి, ప్రసాద్, సురేష్, వెంకటరావు పాల్గొన్నారు.

రామమందిర అక్షింతలకు ఘనస్వాగతం



విజ్జేశ్వరంలో బాలరాముని అక్షింతలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

నిడదవోలు, జనవరి 16: మండలంలోని విజ్జేశ్వరంలో మంగళవారం అయోధ్య నుంచి వచ్చిన రామ మందిర ప్రాణప్రతిష్ట ఆహ్వానపత్రికను, బాల రాముని పూజా అక్షింతలను మేళతాళాలు, కోలాటం నడుమ ఊరేగించారు. రామ భక్తులు ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హరిదాసునికి ఘన సత్కారం

నల్లజర్ల, జనవరి 16: మండలంలోని చీపురుగూడెం గ్రామంలో హరిదాసు బెజవాడ సతీష్‌ను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. సతీష్ ప్రతి ఏటా చీపురుగూడెం, పోతవరం, కవులూరు, పోతీనీడుపలెంలో సంక్రాంతికి గ్రామ పురవీధుల్లో హరినామ సంకీర్తనం చేస్తున్నారు. సంక్రాంతి ముగింపు సందర్భంగా చీపురుగూడెం గ్రామస్థులు సతీష్‌ను, ఆయన సోదరుడుని బుధవారం ఘనంగా సత్కరించి పారితోషకం అందించారు. కార్యక్రమంలో చెల్లు సుబ్రహ్మణ్యం, పెద్ద రామన్న, వీరవెంకట్రావు, కూనంపూడి వెంకటేశ్వరరావు, చెల్లు సత్యనారాయణ, మద్దిపాటి సూరి, తలంశెట్టి రామకోటి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అనంతపల్లి హైస్కూల్1979-80 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

నల్లజర్ల, జనవరి 16: మండలం అనంతపల్లి హైస్కూల్లో 1979-80 సంవత్సరంలో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు మంగళవారం సమావేశమయ్యారు. దాదాపు 43 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరంతా ఒకరి యోగక్షేమలు మరొకరు తెలుసుకున్నారు. ఆనాటి సంగతులను, అల్లరి చేష్టలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, తాళ్ళూరి సత్యనారాయణ, విజయకుమారి, ప్రసాద్, అప్పారావు, పద్మవాణి, ప్రభాకరావు పాల్గొన్నారు

కోడి పందాల నిర్వాహకులపై 13 కేసులు

కొవ్వూరు, జనవరి 16: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై 13 కేసులు నమోదు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మూడు రోజులుగా కోడి పందాలు, గుండాట, పేకాట నిర్వహించిన 31 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. కొవ్వూరులోని నందమూరు రోడ్‌లో, వేములూరు, ఔరంగాబాద్, ఆరికిరేవులలో దాడులు నిర్వహించి రూ.10,680 నగదుతోపాటు పలు కోళ్లు, కోడికత్తులు, డైస్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. అలాగే కొవ్వూరు మండలం సీతంపేట, పంగిడి, పశివేద గ్రామాల్లో దాడులు నిర్వహించి 18 మందిపై కేసులు నమోదు చేసి రూ.9,870 నగదుతో పాటు కోళ్లు, కోడికత్తులు, డైస్ స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ జి.సతీష్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఒంటరి తనాన్ని భరించలేక ఆత్మహత్యాయత్నం

కొవ్వూరు, జనవరి 16: ఒంటరి తనాన్ని భరించలేక మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్.ఐ జి.సతీష్ తెలిపారు. కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన కొక్కిరిపాటి రామారావు(30) దంపతులు మూడేళ్ల విడిపోయారు. అప్పటినుంచి రామారావు చెడు వ్యసనాలకు బానిసై ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఒంటరితనాన్ని భరించలేక ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

టూరిస్టు బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

కొవ్వూరు, జనవరి 16: టూరిస్టు బస్సు ఢీకొని వ్యక్తి గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్.ఐ జి.సతీష్ తెలిపారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గిరిడి మధుకుమార్ ఓ వ్యాన్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 15న దేవరపల్లి మండలం యాదవోలు నుంచి నిమ్మకాయల లోడ్ వేసుకుని విశాఖపట్నం బయలుదేరాడు. నేషనల్ హైవేపై కొవ్వూరు మండలం కాపవరం వచ్చేసరికి వ్యాన్ సెన్సార్‌లు దెబ్బతింది. దీంతో కిందకు దిగి వ్యాన్ వెనుక భాగంలో సెల్‌ఫోను వెలుతురులో సెన్సార్‌ను పరిశీలిస్తుండగా వెనుకనుంచి వచ్చిన టూరిస్టు బస్సు ఢీకొట్టింది. గాయపడిన మదుకుమార్‌ను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మధుకుమార్ చిన్నాన్న గిరిడి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నిడదవోలు, జనవరి 16: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. నిడదవోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం సికింద్రాబాద్ నుంచి బ్రహ్మాపూర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్.. పట్టాలు దాటుతున్న సుమారు 50 ఏళ్ల వయస్సున్న వ్యక్తిని ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడని తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరచి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

నిడదవోలు, జనవరి 16: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో మంగళవారం సాయంత్రం రెండు మోటారుసైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కడియం, జనవరి 16: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కడియం పల్ల వెంకన్న నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఏరియర్లు, బకాయిలు, సొమ్ములను ప్రభుత్వం సత్వరం చెల్లించాలని కోరారు. ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయ ఆందోళన కార్యక్రమంపై పోలీసు నిర్బంధాలు ప్రజాస్వామ్యం కాదని విమర్శించారు. 12వ పీఆర్‌సీ కార్యక్రమాలను ప్రభుత్వం త్వరగా ప్రారంభించాలన్నారు.

జనసేనలో చేరికలు

చాగల్లు, జనవరి 16: మండలంలోని ఎస్.ముప్పవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ, ఇతర పార్టీల నాయకులు జనసేనలో చేరారు. మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు సమక్షంలో జాన సత్యనారాయణగౌడ్ తన అనుచరులతో కలిసి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధిస్తుందన్నారు.



నల్లజర్లలో నిర్వహించిన పందెంలో తలపడుతున్న కోళ్లు



తాళ్లపూడిలో కోడి పందాలను వీక్షిస్తున్న ఔత్సాహికులు



చాగల్లు: ఊనగట్లలో పందానికి కోళ్లను సిద్ధం చేస్తున్న దృశ్యం

కోడీ

- జోరుగా సాగిన కోడి పందాలు
- చేతులు మారిన కోట్ల రూపాయలు .. కోజాకు ఎగబడిన మాంసం ప్రియులు
- బరుల వద్ద గుండాటతో పాటు పేకాట, కోతాట

నల్లజర్ల/తాళ్లపూడి/నిడదవోలు/చాగల్లు/కొవ్వూరు/దేవరపల్లి/గోపాలపురం, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు కోడి పందాలు జోరుగా జరిగాయి. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పలు గ్రామాల్లో కోడి పందాల బరులు నిర్వహించగా అనేక మంది పందెంరాయుళ్ల కోళ్లకు కత్తులు కట్టి వేలల్లో పందాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరుల్లో పలువురు ప్రజాప్రతినిధుల సమక్షంలో పందాలు నిర్వహించారు. మహిళలు, పిల్లలు సైతం బరుల వద్దకు వచ్చి కోడిపందాలు చూసేందుకు ప్రత్యేక ఆసక్తి చూపించారు. అలాగే పలు చోట్ల బహిరంగంగానే గుండాటలు ఏర్పాటు చేసి కాయ్ రాజా కాయ్ అంటూ పందాలు నిర్వహించారు. నిన్న మొన్నటి వరకు జూదాలు, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన పోలీసులు చివరకు ప్రేక్షక పాత్ర వహించారు. బరులు ఏర్పాటు చేసిన ప్రాంగణం వద్ద మద్యం ఏరులై పారింది. నల్లజర్ల మండలంలో నల్లజర్ల, ప్రకాశరావుపాలెం, దూబచర్ల, పుల్లలపాడు,ముసుళ్లకుంట, ఘంటావారిగూడెం, కవులూరు, పోతవరం, అనంతపల్లి, చోడవరం, తెలికిచర్ల గ్రామాల్లో కోడి పందాలు, పేకాట, గుండాట, కోతాట నిర్వహించారు. నల్లజర్ల, పోతవరం, అనంతపల్లి, దూబచర్లలో భారీ స్థాయిలో పందాల జరిగాయి. వివిధ వ్యక్తుల చేతుల ఉంచి కోట్ల రూపాయలు చేతులు మారాయి. జోడిల పందెలు రూ.25వేల నుంచి రూ.2 లక్షల వరకు సాగాయి. ప్రకాశరావుపాలెంలో భిక్షాటన చేస్తున్న వ్యక్తిని అదే గ్రామానికి చెందిన యువకుడు బీరు సీసాతో దాడి చేయడంతో 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తాళ్లపూడి మండలం మలకపల్లి, గజ్జరంలో మహిళలు సైతం హాజరై కోడి పందాలు వీక్షించారు. కాగా మండలంలో వైసీపీ వర్గీయులు ఐదు చోట్ల, టీడీపీ వర్గీయులు మూడు చోట్ల పందాలు నిర్వహించారు. నిడదవోలు మండలంలో సుమారు 8 చోట్ల కోడి పందేలు నిర్వహించారు. మూడు రోజుల్లో సుమారు రూ.కోటి పైగానే చేతులు మారినట్టు సమాచారం. కోజా కోసం మాంసాహార ప్రియులు ఎగబడ్డారు. ఒక్కోటి సుమారు రూ.3 నుంచి రూ.5 వేల వరకు సొమ్ములు వెచ్చించి కొనుగోలు చేశారు. చాగల్లు మండలంలో చాగల్లు ఇందిరమ్మకాలనీ, ఊనగట్ల, నందిగంపాడు, చిక్కాల, బ్రాహ్మణగూడెం, మల్లవరం గ్రామాల్లో ప్రత్యేక బరులు ఏర్పాటు చేసి కోడి పందాలు, గుండాట, పేకాట నిర్వహించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో కోడి పందాలు సందర్భంగా నిర్వాహకులు మోసపూరితంగా వ్యవహరించి కావలసిన వారికి గెలుపు అనుకూలంగా ఉండేలా వ్యవహరిస్తున్నారని ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా కొద్దిపాటి ఘర్షణ చోటుచేసుకుంది. మూడు రోజుల పాటు ఇదే తంతు కొసాగుతుందని ఆరోపించారు. చిక్కాల కోడి పందాల బరిలోను ఇదే తంతు కొనసాగిందని ఆరోపణలు చేస్తున్నారు. కోడి పందాలు నిర్వహించే ప్రదేశాల్లో పోలీసులు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొవ్వూరు మండలం సీతంపేట బ్యారేజ్ వద్ద, తోగుమ్మి, పంగిడి, పశివేదల, ఆరికిరేవుల, ఔరంగాబాద్, కొవ్వూరు పట్టణంలోని నందమూరు రోడ్‌లో కోడి పందాలతో పాటు గుండాట, పేకాట బారీఎత్తున నిర్వహించారు. కోజాకు రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకూ డిమాండ్ పలికింది. దేవరపల్లి మండలం దేవరపల్లి, త్యాజంపూడి, యర్నగూడెం, బందపురం గ్రామాల్లో కోడిపందెలు, గుండాట నిర్వహించారు. పందెల్లో పందెంరాయుళ్లతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గోపాలపురం మండలం గోపాలపురం, వేళ్లచింతలగూడెం, వెంకటాయపాలెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, దొండపూడి హుకుంపేటలో రెండుచోట్ల కోడిపందాల బరులను కోలాహలంగా నిర్వహించారు. వేళ్లచింతలగూడెంలో నిర్వహించిన పందాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. ఈ పందాల్లో సుమారు కోటి రూపాయలు చేతులు మారాయి.



కొవ్వూరు నందమూరురోడ్‌లో కోడి పందెం నిర్వహిస్తున్న దృశ్యం



దేవరపల్లి: చిన్నాయిగూడెంలో గుండాట ఆడుతున్న దృశ్యం



గోపాలపురంలో బరిలో కొట్లాడుకుంటున్న కోడిపుంజులు

సంక్రాంతి సంబరాలు

- మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన వేడుకలు
- పలుచోట్ల అమ్మవార్ల ఉత్సవాలు.. ముగ్గుల పోటీలు



నల్లజర్ల: ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందిస్తున్న సువర్ణరాజు

తాళ్లపూడి, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు సంబరాలు అంబరాన్నంటాయి. ప్రతి గ్రామంలో సందడి నెలకొంది. మండలంలోని పెద్దేవం గ్రామంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు నామన చిన బూరయ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీనికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో పసలపూడి వెంకటలక్ష్మి, సంకాబత్తుల లక్ష్మి, సిద్దా రామకృష్ణ, లిఖిత, సుంకర సత్తిబాబు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని చోడవరం, తెలికిచర్ల గ్రామాల్లో మంగళవారం



ఉండ్రాజవరం: వేలివెన్నులో సంబరాలకు హాజరైన మహిళలు, చిన్నారులు

కాపు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 100 మంది మహిళలు ముగ్గులు వేశారు. విజేతలకు జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, రుద్ర శ్రీను, కేదాసి కృపానందం, బాసంశెట్టి రాంబాబు, ఉన్నమట్ల రమేష్, ఆకుల వివేక్, పుంజుల శ్రీను పాల్గొన్నారు. చీపురుగూడెంలో గ్రామ దేవత తుమ్మలమ్మ ఊరేగింపు ఘనంగా జరిగింది. గరక నృత్యాలు, తీన్‌మార్ డప్పులతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్నులో శశిధర్ మెమోరియల్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం మహిళలకు, చిన్నారులకు ఆటలు, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. లక్కీ డ్రాలు తీశారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, శశి అధినేత బూరుగుపల్లి రవికుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ఉండ్రాజవరం, కె.సావరంలో జనసేన ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు జనసేన నాయకుడు, కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, నార్ని ప్రసాద్ బంగారం, వెండి పట్టీలు, మిక్సర్, గ్రైండర్లను బహుమతులుగా అందజేశారు.

వాడపల్లిలో ఎస్పీ జగదీశ్ పూజలు



ఎస్పీ జగదీశ్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 16: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఎస్పీ పి.జగదీశ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీస్సులతో పాటు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎస్పీ వెంట ఆత్రేయపురం ఎస్ఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.

షర్మిల నియామకం కాంగ్రెస్‌కు శుభపరిణామం

కడియం/రాజమహేంద్రవరంరూరల్, జనవరి 16: ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియమితులవ్వడం కాంగ్రెస్ పార్టీకి శుభపరిణామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాడాల కొండ్రాజు, రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రెండు సార్లు కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టిందని, ఆయన తనయురాలు షర్మిల ఆధ్వర్యంలో పార్టీ బలోపేతమవుతుందని, రాబోవు రోజుల్లో కాంగ్రెస్ విజయం సాధించి పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన కేడర్ మరలా రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. షర్మిలను ప్రత్యక్షంగా కలిసి పార్టీ కార్యాచరణపై చర్చించి రాబోయే ఎన్నికల్లో గెలుపుబాటలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



బిక్కవోలులో సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

బిక్కవోలు, జనవరి 16: గ్రామంలోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. కనుమ పండుగ, స్వామికి ప్రీతికరమైన మంగళవారం, స్వామి జన్మనక్షత్రమైన షష్ఠి తిథి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. ఉదయం నుంచి బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు కుజ, రజ, కాల, సర్ప దోష నివారణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో దేవదాయశాఖ ఆధ్వర్యంలోను, అలాగే స్థానిక అన్నదాన సత్రంలో భక్తులకు ఉచితంగా అన్నదాన ఏర్పాట్లు చేశారు.

కొంకుదురులో ఆన్‌లైన్‌లో ముగ్గుల పోటీలు

బిక్కవోలు, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా కొంకుదురులో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణిరాజా, ఎంపీటీసీ పీపీ, మాజీ సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా సంతకాల సేకరణ



తాళ్లపూడిలో పండుగలో సైతం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

కొవ్వూరు, జనవరి 16: అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం 36వ రోజు సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ నాయకుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా కక్ష సాధింపు చర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చమంటే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లపై చర్యలు తీసుకుంటూ నోటీసులు అంటించడం సరైంది కాదన్నారు. వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్. భవాని ఎస్.శాంతకుమారి, ఎ.భ్రమరాంబ, బి.వసంత, కేసీ లక్ష్మి, బి.ఉష, బి.గౌతమి, వి.శ్రీదేవి, యు.దుర్గ పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన దీక్షలు పండుగ రోజుల్లోనూ కొనసాగించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చేపట్టిన సమ్మె చేసే ప్రాంతంలోనే భోగి రోజున మంటలు వేసి నిరసన కొనసాగిస్తూనే సంక్రాంతి మూడు రోజులు సమ్మెను కొనసాగించారు. తమపై ప్రయోగించిన ఎస్మా పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ జీవో పత్రాలను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు.

వైభవంగా వీరుళ్లమ్మ జాతర ఉత్సవాలు

అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



వీరుళ్లమ్మను ఎమ్మెల్యే దంపతులతో కలిసి దర్శించుకుంటున్న హైదరాబాద్ యశోద హాస్పిటల్ డాక్టర్ దశరథరామారెడ్డి

అనపర్తి, జనవరి 16: అనపర్తి గ్రామ దేవత వీరుళ్ళమ్మ జాతర ఉత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి జాతర ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు గరగలనెత్తి ఉత్సవా లను ప్రారంభించారు. జాతరలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలకంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పోటీలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా హైదరాబాద్ యశోద ఆసుపత్రి ఆర్థోపెడిక్ చీఫ్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథరామారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన డీఐజీ వెలివెల సత్యనారాయణ, నటి శ్రీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. బుధ, గురువారాల్లో కూడా అమ్మవారి తీర్థ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, పడాల కళ్యాణిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జంబుపట్నంలో లక్ష్మీనరసింహుడి గ్రామోత్సవం

కోరుకొండ, జనవరి 16: జంబుపట్నంలో ఏడాదికోసారి జరిగే కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం మంగళవారం (కనుమ పండుగ రోజున) ఘనంగా జరిగింది. అంతకుముందు గ్రామ పెద్దలు స్వామి ఆలయానికి వచ్చి పులిహోర భోగం చేయించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పల్లకిలో లక్ష్మీదేవితో కలిసి జంబూపట్నం బయల్దేరారు. ఈ సందర్భంగా 3 కిలోమీటర్ల మేర కోరుకొండ, పశ్చిమగోన గూడెం, జంబుపట్నం గ్రామాల ప్రజలు రోడ్లపై రంగ వల్లులు వేసి మంగళహారతులతో స్వామికి స్వాగతం పలికారు. జంటూపట్నంలో ఆడపడుచులంతా స్వామికి పండ్లు, బియ్యం సమర్పించారు. జమిందార్ వుల్లి గోపయ్య ఇంటి వద్ద స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వుల్లి అప్పన్నదొర, రొంగల దేవిక, నాయకులు వుల్లి బుజ్జిబాబు, నాగా సత్యనారాయణ, నాగా రమేష్, కాండ్రేగుల కృష్ణ, వుల్లి చల్లారావు, వుల్లి పట్టాభి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనపర్తి, జనవరి 16: అనపర్తిలోని జీబీఆర్ జూనియర్ కళాశాలలో 1998-2000 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థుల సమ్మేళనం మంగళవారం అదే కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలో కలియతిరుగుతూ ఆనాటి సంగతులను, అల్లరి చేష్టలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు.



అనపర్తిలోని జీబీఆర్ జూనియర్ కళాశాల 1998-2000 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	గుంటూరుకారం
వై.స్ర్కీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్